ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 8 మార్చి 2025

ఆమె సహనానికి మారుపేరు. సకలచరాచర జీవికి మూలం. సృష్టికి ప్రతిసృష్టి చేసే శక్తిస్వరూపం. అయినా మహిళ అంటే గతంలో వంటింటికే పరిమితం. ఇప్పుడు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోనూ వందశాతం రాణిస్తున్నారు. వ్యాపారం, ఉద్యోగం, రాజకీయం.. ఏ రంగమైనా సరే.. మహిళలు ముందంజలో ఉన్నారు. ఇక రాజకీయాల్లో కూడా రాణిస్తూ తమ మార్కు చాటుకుంటున్నారు. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా 2022 నోటిఫికేషన్‌లో పరీక్షలు రాసి జిల్లాకు వచ్చిన మహిళా ప్రొహిబిషనరీ ఎస్‌ఐలపై ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)



అన్నింటా.. ఆమె

● అతివలు.. అవకాశాల్లో... సగం ● పురుషులతో దీటుగా.. సమాన అవకాశాలు

● వంటింటి నుంచి నింగిలోకి ● క్రమంగా పెరుగుతున్న మహిళా సాధికారిత

● నేడు ప్రపంచ మహిళా దినోత్సవం



యూనిఫామ్ ఉద్యోగం అమ్మ కోరిక

మాది చిత్తూరు జిల్లా, ఎస్‌ఆర్‌పురం మండలం, కొత్తపల్లె మిట్ట. నాన్న రామిరెడ్డి, తల్లి స్వర్ణలత గృహిణి. 5వ తరగతి వరకు ప్రైవేటు స్కూల్‌లో చదివాను. నాన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో.. ఊరిలోని ఉన్నత పాఠశాలలో 10 వరకు చదివాను. ఫలితాల్లో మండల ఫస్ట్‌గా వచ్చాను. తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి ఎంపికై బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాను. అమ్మకు యూనిఫామ్ (పోలీసు) ఉద్యోగం అంటే.. ఇష్టం. దీంతో నాన్న ఆర్థికంగా సాయం అందించడంతో.. 2022 నోటిఫికేషన్‌లో పరీక్ష రాశాను. 2023లో ఫలితాలు వచ్చాయి. 2024లో ట్రైనింగ్‌కు పిలిచారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అనంతపురం పీటీసీలో ట్రైనింగ్ పూర్తి చేసుకున్నాము. ఇప్పుడు ప్రొబిషినరీ ఎస్‌ఐగా అన్నమయ్య జిల్లాకు వచ్చాను. ప్రజలకు సేవ చేయాలన్నదే ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం ప్రొబెషనరీ ఎస్‌ఐగా గ్రేహౌండ్స్ శిక్షణకు వెళ్తున్నాను.

- సుష్మిత, ప్రొహిబిషనరీ ఎస్‌ఐ



నాన్న రిటైర్ అయ్యారు.. నేను విధుల్లో చేరుతున్నా

మా నాన్న క్రిష్ణయ్యది భాకరాపేట దగ్గర ఈదలచెర్వుపల్లె గ్రామం. ఉద్యోగ రీత్యా మా కుటుంబం తిరుపతిలో స్థిరపడింది. నాన్న పోలీసుశాఖలో ఎస్‌ఐగా పనిచేస్తూ రిటైర్ అయ్యారు. అమ్మ హేమలత గృహిణి. తిరుపతి ఆర్ట్స్ కాలేజ్‌లో డిగ్రీ చేశాను. ఎస్వీ యూనివర్శిటీలో ఎంబీఏ, ఎంఏ చేశాను. ఎస్‌ఐగా పనిచేస్తూ మా నాన్న ప్రజలకు సేవ చేసినపుడు వచ్చే గౌరవాన్ని చిన్నప్పటి నుంచి చూశాను. అసలు ఈ ఉద్యోగంలోకి రావాలనే ఆలోచనే.. మా అన్న వల్ల వచ్చింది. ప్రస్తుతం సమాజంలో చిన్న పిల్లలపై పెద్దపెద్ద నేరాలు జరుగుతున్నాయి. వీటిని నివారించడానికి కృషి చేయాలనే ఈ ఉద్యోగంలోకి వచ్చాను. గతంలో రెండు సార్లు కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. అయితే ఎస్‌ఐ కావాలనుకోవడంతో.. కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరలేదు. సివిల్స్ కొట్టాలన్నది నా కల. ప్రస్తుతం ప్రొబెషనరీ ఎస్‌ఐగా గ్రేహౌండ్స్ శిక్షణకు వెళ్తున్నాను.

- తేజస్విని, ప్రొహిబిషనరీ ఎస్‌ఐ

మొదటి ప్రయత్నంలోనే సాధించా



మాది భాకరాపేట పక్కన ఉలసలవారిపల్లె. తల్లిదండ్రులు చెన్నకేశవులు, గీతాసుధ ఉపాధ్యాయులు. నాన్న 2022లో చనిపోయారు. 8వ తరగతి వరకు తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు భాకరాపేటలో చదివాను. 9 తరగతి నుంచి తిరుపతిలో చదివాను. తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో బీటెక్ మెకానికల్ పూర్తి చేశాను. అమ్మ, తమ్ముడు, మేనమామ ప్రేరణ ప్రోత్సాహం వల్లే ఈ ఉద్యోగంలోకి వచ్చాను. లక్ష్యసాధనే ధ్యేయంగా చదివి.. మొదటి ప్రయత్నంలోనే ఎస్‌ఐ ఉద్యోగం సాధించారు. అన్నయ్య కస్టమ్స్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. బాధితులకు పోలీసు శాఖ పట్ల గౌరవం పెరిగే విధంగా విధులు నిర్వహిస్తాను. ప్రస్తుతం నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో శిక్షణ కోసం వెళ్తున్నాను.

- హారిక, ప్రొహిబిషనరీ ఎస్‌ఐ

తల్లిదండ్రులే ఆదర్శం



మాది అన్నమయ్య జిల్లా మదనపల్లె. నాన్న మునిస్వామినాయక్ ఏఆర్ ఎస్‌ఐగా పనిచేస్తున్నారు. మేము తిరుపతిలో స్థిర పడ్డాము. అమ్మ పుష్పకుమారి పార్మా కళాశాలలో ప్రొఫెషర్. మేము ముగ్గురు ఆడపిల్లలం. ఇద్దరు అక్కలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. వారిద్దరికీ వివాహాల య్యాయి. చిన్నప్పటి నుంచీ ఆడపిల్ల అనే ఆంక్షలు లేకుండా స్వేచ్ఛగా పెంచారు. సేవ పరంగా నాన్న ఆదర్శమైతే.. చదువు పరంగా అమ్మ ఆదర్శం. వీటిని గమనించే.. ఎస్‌ఐగా ఉద్యోగం సాధించాలనుకున్నా. సివిల్స్ లక్ష్యం.. ఇంతలో ఎస్‌ఐ నోటిఫికేషన్ పడడంతో ప్రిపేర్ అయ్యాను. మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించాను. ప్రస్తుతం ప్రొబెషనరీ ఎస్‌ఐగా గ్రేహౌండ్స్ శిక్షణకు వెళ్తున్నాను.

- శ్రీప్రియ, ప్రొహిబిషనరీ ఎస్‌ఐ

పల్లె కథల భారతి

నిమ్మనపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కూలి పనులు చేసుకునే ఓ మహిళ కాలక్రమేణ జర్నలిస్టుగా.. లఘుచిత్ర నిర్మాతగా.. రచయితగా ఎదిగారు. ఆమె జీవన ప్రస్థానంలో ఎన్నో అవార్డులు, మరెన్నో ప్రశంసలు సొంతం చేసుకున్నారు. ఆమె మరెవరో కాదు.. మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ, దిగువబురుజు గ్రామీణ ప్రాంతానికి చెందిన భారతి. 1981లో జన్మించిన భారతి.. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోవడంతో అమ్మమ్మ దగ్గర పెరిగారు. 5వ తరగతి వరకు విద్యనభ్యసించారు. చిన్న వయసులోనే వివాహం జరిగింది. ముగ్గురు పిల్లలు. కొద్దికాలం ఆవులను మేపుకుంటూ కూలిపనులకు వెళ్లేవారు. అనంతరం స్వయం సహాయక సంఘాల కోసం పనిచేసే నవోదయం అనే పత్రికలో పనిచేశారు. పేద మహిళల కోసం ఏర్పాటు చేసిన ఆ పత్రికను నిలబెట్టడంలో ఆమె పాత్ర ఎంతో కీలకం. సంఘాల సమస్యలపైన భారతి లఘుచిత్రాలు నిర్మించారు. అనంతరం నెట్‌వర్క్ ఆఫ్ ఉమెన్ ఇన్ మీడియా సంస్థలో సభ్యురాలిగా చేరారు. అప్పటి నుంచి కోల్‌కతా, బెంగళూరు, పూణే, మణిపూర్, కేరళ, అహ్మదాబాద్ రాష్ట్రాల్లో పర్యటించారు.



కథా రచయిత్రి భారతి


భారతికి చిన్నప్పటి నుంచి కథలు రాయడమంటే మక్కువ. ఆమె రాసిన కథలతో ఎదారిబతుకులు, బతుకీత, జాలారిపూలు, దేవరహస్యాలు కథల పుస్తకాలు వెలువడ్డాయి. అలాగే జక్కీకు అనే వచ్చింది. ఈమె రాసిన కథలలో పేద శ్రామిక మహిళల వెతలు, తమదైన సంస్కృతి, సామాజిక చింతన, పల్లెల రూపురేఖలు స్పష్టంగా కనిపిస్తాయి. భారతి రచనలకు గాను పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు పొందారు. ఒక గ్రామీణ ప్రాంతంలో జన్మించి సాధారణ మహిళగా బాధ్యతలు నెరవేరుస్తూ విశిష్ట రచయిత్రిగా గుర్తింపు పొందిన ఈమెకు పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

6

బ్రెడ్డు తిని ఐదుగురు విద్యార్థులకు అస్వస్థత

ఒంటిమిట్టలో శాస్త్రోక్తంగా మహా సంప్రోక్షణ

రాజంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం రెండో భద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయంలో టీటీడీ ఆగమ సలహాదారుడు, ప్రధాన అర్చకుడు కంకణబట్టర్ రాజేష్‌స్వామి ఆధ్వర్యంలో మహా సంప్రోక్షణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు సహస్ర కలశవాహన, రామతారక హోమం, శ్రీమద్రాయణ హోమం, విమానగోపురం ఛాయా స్నపనం, పరివార హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, మూర్తి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

చాపకింద నీరులా...

● జోరుగా సాగుతున్న మట్కా దందా

● టెక్నాలజీని వాడుకుంటున్న బీటర్లు

● పోలీసులకు సవాల్‌గా మారిన వ్యవహారం

7



విధి నిర్వహణలో డాక్టర్ల అలసత్వం

● ఒకరి సస్పెన్షన్.. మరొకరికి షోకాజ్ నోటీసులు

6

బతికుండగానే డెత్ సర్టిఫికెట్ సృష్టించి..

● స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు

● పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు

7

అవినీతి అధికారులపై కలెక్టర్ కొరడా

7

● తాజాగా మరో ఇద్దరిపై వేటు

● పంచాయతీ సెక్రటరీ పుల్లారెడ్డి సస్పెన్షన్


● కంప్యూటర్ అపరేటర్ హనీఫ్ బాషా సర్వీస్ నుంచి తొలగింపు

కనుల పండువగా

కల్కి బ్రహ్మోత్సవాలు

● ముత్యపుపందిరి, హనుమంత వాహనాలపై నరసింహుడి చిద్విలాసం

● ఆకట్టుకున్న కేరళ డ్రమ్స్, కోలాటం



హనుమంత వాహనంపై కొలువుదీరిన స్వామివారు



ముత్యపుపందిరి వాహనంపై స్వామివారు

గుర్రంకొండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు ముత్యపు, హనుమంత వాహనాలపై భక్తులకు దర్శమిచ్చారు. ఉదయాన్నే స్వామి వారిని మేల్కొలిపి, ఆలయశుద్ధి, తోమాలసేవ, అర్చన, ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ముత్యపు పందిరి వాహనంలో స్వామివారిని ఉంచి గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ, రాత్రి హనుమంత వాహనంలో అధిరోహింపజేసి ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో హనుమంత వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించగా, వాహనం ముందు కోలాటాలు, కేరళ డ్రమ్స్, చెక్కభజనలు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్శనార్థం విచ్చేశారు. వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనంపై, రాత్రికి సింహవాహనంపై ఊరేగనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఆలయాధికారి కృష్ణమూర్తి అర్చకులు గోపాల్‌భట్టార్, కృష్ణరాజ్, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, నరసింహ, ధనుష్, వెంకీ, వదర, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత రవాణా

కలికిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఆ మేరకు సంస్థ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు, జిల్లా ప్రజారవాణా అధికారులకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ శుక్రవారం సూచనలు జారీ చేసింది. ఈ నెల 17 నుంచి 31 వరకూ అవసరమైతే ఏప్రిల్ 1వ తేది కూడా అభ్యర్థులకు ఉచిత రవాణా సదుపాయం కల్పించాలని ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్, ఎండీ కార్యాలయాన్ని కోరింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 3450 కేంద్రాల్లో 6,49,884 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఆ మేరకు బస్సు సర్వీసులను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొంది. విద్యార్థులకు ఎలాంటి బస్సు పాసులు లేకున్నా హాల్‌టికెట్ల ఆధారంగా బస్సు ఎక్కిన ప్రతి విద్యార్థిని పరీక్షా కేంద్రానికి చేర్చాలంది. అల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపింది. పరీక్షలు జరిగే రోజుల్లో మాత్రమే అనుమతివ్వనున్నారు. ఒకవేళ సెలవుదినాల్లో పరీక్షలు జరిగినా కూడా అనుమతి ఇవ్వాలంది. ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని సరిపడా బస్సులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల వారీగా విద్యార్థుల కేటాయింపును హాల్‌టికెట్ల ఆధారంగా అంచనా వేసుకోవాలని సూచించారు.

డ్వాక్రా లీడర్ రూ.12 లక్షల దుర్వినియోగం



వివరాలు 6లో...

నాటుసారాకు స్వస్తి పలకాలి

● ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు కల్పిస్తాం

● సారా తయారీ, విక్రేతలకు సంక్షేమ పథకాలు కట్

● నవోదయం 2.0లో కలెక్టర్ శ్రీధర్



జిల్లేళ్లమందలో నవోదయం ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎక్సైజ్ అధికారులు

పీలేరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాల సంక్షేమం, బంగారు భవిష్యత్తు కోసం నాటుసారా తయారీకి స్వస్తి పలకాలని కేవీ పల్లె మండలం జిల్లేళ్లమంద పంచాయతీలోని గిరిజనులకు కలెక్టర్ శ్రీధర్ సూచించారు. నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ సాధనంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా అమలు చేస్తున్న నవోదయం 2.0 కార్యక్రమాన్ని జిల్లా ఎక్సైజ్ అధికారులు శుక్రవారం జిల్లేళ్లమందలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన పెంచి, తయారీదారులకు ప్రత్యామ్నాయ జీవనోపాధులు కల్పించి, తద్వారా సమాజం నుంచి నాటుసారాను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం నవోదయం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు, భవిష్యత్ తరాల సంక్షేమం, భవిష్యత్తు కోసమైనా నాటుసారా తయారీదారులు ఆ వృత్తిని మానివేయాలన్నారు. అవగాహన సదస్సులు, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు కల్పించినా నాటుసారా తయారీని మానని వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. అటువంటి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేయడమే కాకుండా పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. కేవలం తయారీదారులపైనే కాకుండా అక్రమ నల్లబెల్లం వ్యాపారులు, సారా తయారీకి ముడిసరుకులు సరఫరా చేసేవారు, సారా విక్రేతలు, బ్రోకర్లు, సేవించే వారిపై కూడా పీడీ యాక్టు ప్రయోగిస్తామని హెచ్చరించారు. జిల్లాలోని ప్రతి కుగ్రామం కూడా సారా రహితంగా మారి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నదే తన అభిమతమన్నారు. నాటుసారాకు సంబంధించిన ఏ ఫిర్యాదు చేయాలన్నా 14405 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. నాటుసారా నిర్మూలనకు కట్టుబడి ఉంటామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కాగా తమ గ్రామంలోని ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకున్నా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని జిల్లేళ్లమంద గ్రామస్తులు కలెక్టర్‌కు తెలిపారు. మదనపల్లెకు చెందిన కళామైత్రి సాంస్కృతిక సంస్థకు చెందిన కళాకారులు నాటుసారా పర్యావసనాలపై ఆలపించిన గేయాలు, ప్రదర్శించిన నాటకాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజ్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, సూపరింటెండెంట్ మధుసూదన్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర, డీపీవో మస్తాన్‌వలీ, జిల్లా పరిశ్రమల అధికారి కృష్ణారావు, డ్వామా పీడీ వెంకటరత్నం, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, సీడీపీవో రాజమ్మ, ఎంపీపీ ఈశ్వరమ్మ, జిల్లేళ్లమంద సర్పంచ్ కృష్ణవేణి, కరణంవారిపల్లె సర్పంచ్ అమ్ములు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

రాయచోటి(కలెక్టరేట్),మార్చి7(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణం నారాయణ ఫంక్షన్ హాల్ (రాజంపేట రోడ్డు)లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఉదయం 9 గంటల నుండి ఘనంగా నిర్వహించనున్నారని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మాత్యులు బీసీ జనార్థన్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌లు హాజరుకానున్నట్లుగా ఆమె తెలిపారు.


రాయచోటి పరిపాలన కేంద్రంగా

జిల్లా కొనసాగుతుంది

● ఎటువంటి వదంతులు నమ్మవద్దు ● రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాయచోటి పరిపాలన కేంద్రంగా అన్నమయ్య జిల్లా కొనసాగుతుందని, ఇందులో ఎటువంటి మార్పు ఉండదని, ఎటువంటి వదంతులు నమ్మవద్దని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి రాష్ట్రంలో జిల్లాల పునర్విభ్యవస్థీకరణ ప్రతిపాదన ఏమైనా ఉందా? ఉంటే ఎటువంటి ప్రతిపాదనలు ఉన్నాయి? వాటి ప్రక్రియను ఎప్పటిలోగా పూర్తి చేయనున్నారు వంటి ప్రశ్నలను సంధించారు. ఇందుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానమిస్తూ జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనలు ఏమీ లేవని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి పరిపాలనా కేంద్రంగా అన్నమయ్య జిల్లా కొనసాగుతుందని, ఇందులో ఎటువంటి మార్పు ఉండదని ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసిందన్నారు. అన్నమయ్య జిల్లాతో పాటు మిగతా జిల్లా కేంద్రాల్లో భవిష్యత్తులో ఎటువంటి మార్పు ఉండదని, ఈ విషయంపై ఎటువంటి వదంతులు నమ్మవద్దని ప్రజలకు మంత్రి సూచించారు.

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (శనివారం సాయంత్రం)	సెహరీ (ఆదివారం ఉదయం)
రాయచోటి	6.29	5.07
మదనపల్లె	6.30	5.13
రాజంపేట	6.27	5.15
పీలేరు	6.28	5.06



- వరండాలోనే విలువైన మందులు, స్టేషనరీ నిల్వ
- చాలీచాలని గదుల్లో విధుల నిర్వహణ
- ఉద్యోగులు కూర్చునేందుకు కుర్చీల కొరత
- ఇదీ.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం తీరు

ఆరోగ్య శాఖ కార్యాలయానికి బాలారిష్టాలు..

హడావుడిగా జిల్లాలు విభజించిన ప్రభుత్వం ఏళ్లు గడుస్తున్నా జిల్లాకు అవసరమైన అన్ని వనరులూ కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనడానికి రాయచోటిలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం అద్దం పడుతోంది. ఏళ్లు గడుస్తున్నా, కనీస వసతులు కల్పించకపోవడంతో అందులో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఏర్పాటు దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు వైద్య ఆరోగ్యశాఖలో కూర్చోవడానికి కుర్చీలు, మందులు నిలువ చేసుకునే వసతి లేక సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఏర్పాటు సమయంలో సాయి ఇంజనీరింగ్ కాలేజీలో దాదాపు పది గదులు అద్దెకు తీసుకొని ఏడాది పాటు కాలం నెట్టుకొచ్చారు. వాటికి నెలకు దాదాపు రూ.1.20 లక్షలు అద్దె చెల్లించలేక 2023లో కడప-చిత్తూరు జాతీయ రహదారిలో ఉన్న ఎస్టీ బాయ్స్ హాస్టల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే అక్కడ తగినన్ని గదులు లేకపోవడం ఒకే గదిలో 10 సెక్షన్ల ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇక మందులు, మెటీరియల్ భద్ర పరి చేందుకు వరండా తప్ప మరెక్కడా స్థలం లేదని చెబుతున్నారు. దీంతో మందులతోపాటు, రికార్డులు తదితర స్టేషనరీ అంతా వరండాలోనే నిలువ చేశారు. కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారు. కానీ కొన్ని కార్యాలయాలకు కనీసం వసతులు కూడా లేని పరిస్థితులు ఈ జిల్లాలో నెలకొని ఉండడం చాలా బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రెండు గదులైనా నిర్మించి ఇస్తే కొంత బాగుంటుందని ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది చెబుతున్నారు. ఇక ఈ కార్యాలయంలో తాగటానికి నీరు, బాత్‌రూమ్‌లు, ఇంటర్నెట్ సౌకర్యం కూడా సరిగ్గా లేదని తెలిసింది.



వరండాలో నిల్వ చేసిన మందులు స్టేషనరీ

సిబ్బందికి ఇబ్బందిగానే ఉంది..

కొత్త జిల్లాల్లో కనీస వసతుల కొరత ఉంది. విజయవాడ నుంచి మందులు, మెటీరియల్ వస్తే నిలువ చేయడానికి ప్రత్యేకంగా గది లేదు. కాబట్టి వరండాలో వాటిని నిలువ చేస్తున్నారు. గదులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం అన్న మాట వాస్తవమే. ఈ విషయం ఇదివరకే మేము పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-కొండయ్య, జిల్లా వైద్యాధికారి

టమోటా ధరల పతనంపై విచారణ

- ములకలచెరువులో మార్కెటింగ్ శాఖ అధికారి ఆరా..

ములకలచెరువు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు ఇంత దారుణంగా పడిపోవడానికి కారణమేమిటంటూ గుంటూరు డైరెక్టరేట్ ఆఫ్ మార్కెటింగ్, ఇన్‌స్పెక్షన్ అధికారి కిరణ్ ఆరా తీశారు. ములకలచెరువు మార్కెట్ యార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. ధరల పతనానికి గల కారణాలపై రైతులను విచారించారు. అనంతరం మార్కెట్ కమిటీ అధికారులు, మండీ యజమానులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఇక్కడి నుంచి టమోటాలు ఎగుమతి అవుతున్న కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో దిగుబడి అధికంగా ఉండడంతో టమోటాలు కొనుగోలుకు బయటి రాష్ట్రాల నుంచి వ్యాపారులు రాకపోవడం ఒక కారణమని గుర్తించారు. ఫలితంగా ధరలు పతనమయ్యాయని మండీ యజమానులు వివరించారు. మదనపల్లె, కలికిరి, గుర్రంకొండ, పుంగనూరు టమోటా మార్కెట్లను కూడా ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ బాలాజీ, సిబ్బంది రాజు, రహీం, సునీల్‌లు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న గుంటూరు మార్కెటింగ్ శాఖ అధికారి కిరణ్

ప్రభుత్వ న్యాయవాదుల నియామకం

కలికిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాకు సంబంధించి రెండు వేర్వేరు కోర్టుల్లో ఇద్దరు న్యాయవాదులను ప్రభుత్వం నియమించింది. రాయలసీమ జిల్లాలకు సంబంధించి దేవదాయ శాఖ తరపున స్టాండింగ్ కౌన్సిల్ నియామకం కూడా చేసింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం మూడు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. కడపకు చెందిన న్యాయవాది బి.శ్రీనివాసులును స్థానిక అదనపు సహాయ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి 52 సెషన్స్ కోర్టు కేసులు పరిష్కారమయ్యేంత వరకు, లేదా తొలగించేంత వరకు , లేదా మూడేళ్ల పదవీ కాలం పూర్తయ్యే వరకు ఏది ముందయితే అంత వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ కాలంలో నెలకు రూ.25 వేలు గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఇక కడప పోక్సో కేసుల స్పెషల్ కోర్టులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కడపకు చెందిన మరో న్యాయవాది కొమ్మినేని వేణుగోపాల్‌ను నియమించారు. మూడేళ్ళ కాల వ్యవధి ముగిసేంత వరకుగానీ లేదా తొలగించే వరకుగానీ ఏది ముందయితే అంత వరకూ ఆయన ఎస్‌పీపీగా కొనసాగనున్నారు. నెలకు రూ.40 గౌరవ వేతనం చెల్లించనున్నారు. కాగా రాయలసీమ జిల్లాలయిన తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం, నంద్యాల జిల్లాలకు సంబంధించి దేవాదాయ శాఖ కేసులను హైకోర్టులో పర్యవేక్షించడానికి స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది తూము వేణుగోపాల్‌ను నియమించారు. హైకోర్టు అడ్వకేట్ జనరల్ ప్రతిపాదనతో ఈయనను కూడా మూడేళ్ళ కాల వ్యవధితో నియమించారు. నెలకు రూ.50 వేలు గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర నాయ, శాసన వ్యవహారాల కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి శుక్రవారం మూడు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

సెలవు రోజునా.. ఆస్తుల రిజిస్ట్రేషన్లు

మదనపల్లె, మార్చి7(ఆంధ్రజ్యోతి): సెలవు రోజులైన శని, ఆదివారం కూడా తమ కార్యాలయం పనిచేస్తుందని స్థానిక సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామి తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ, ఐజీ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రెండో శనివారం, ఆదివారం కూడా పనిచేస్తుందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సౌమ్యనాథాలయ హుండీ కానుకల లెక్కింపు

నందలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సౌమ్యనాథ స్వామి ఆలయ హుండీలో 24 రోజులకుగాను భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. దీంతో 1,94,302 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టీటీడీ విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

పీలేరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం రేగళ్లు గ్రామ పంచాయతీ నగరి సమీపంలో డి.కృష్ణయ్య(60) అనే వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పొలంలో కృష్ణయ్య మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పీలేరు ఎస్ఐ బాలకృష్ణ సంఘటనా స్థలాన్ని సందర్శించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ..

సిద్దవటం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మెకానిక్ షాపు వద్ద నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని మండల కేంద్రంలోని సిద్దవటం బ్రాహ్మణవీధి నివాసి ఉన్న జి.వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం ఉదయం బాకరాపేట గ్రామంలోని అమీర్ మెకానిక్ షాపులో ద్విచక్ర వాహనం పెట్టి నందిమండలం ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో విధులకు వెళ్లానని, సాయంత్రం ఐదు గంటలకు వచ్చే సరికి ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి బైక్ ఆచూకీ గుర్తిస్తామని తెలియజేశారు.

కొండకు నిప్పు.. మామిడితోటలు దగ్ధం

నిమ్మనపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓబులేసుని కొండకు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సమీపంలోని 15 ఎకరాల్లో వివిధ పైరకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతు నరేంద్ర తోటలోని 45 అల్లనేరేడు చెట్లు, మామిడి చెట్లు కాలిపో, రమణకు చెందిన కంచె, నిమ్మనపల్లి రైతు సిలార్‌కు చెందిన మామిడి తోట కాలిపోయినట్లు తెలిపారు.



మంటలు ఆర్పుతున్న రైతు

సుండుపల్లెలో..

సుండుపల్లె: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో 7 ఎకరాల విస్తీర్ణంలోని తమ మామిడి తోట దగ్ధమైందని రైతులు నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో 80కిపైగా పూత దశలో ఉన్న మామిడి చెట్లు కాలిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలిపోయిన మావిడి తోటను మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీకి చెందిన ఎంపీహెచ్‌ఈవో రెడ్డినాయక్ శుక్రవారం పరిశీలించారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్ తగిలి ఓ యువకుడు గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు బి.కొత్తకోట మండలం, బీరంగి గ్రామానికి చెందిన రవి కుమారుడు శ్రీకాంత్ (24) అదే గ్రామంలో శంకరాపురం వద్ద చెట్టు ఎక్కి ఆకులు కోస్తున్న సమయంలో కరెంటు తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు, గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బి.కొత్తకోట పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న యువకుడు

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు కురబలకోట మండలం, తెట్టు గ్రామానికి చెందిన అశోక్ భార్య బార్గవి (20) శుక్రవారం ఉదయం తన భర్త ,మామలు తరచూ గొడవ పడుతుండడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న మహిళ

వేడి నీళ్లలో పడి చిన్నారికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేడి నీళ్లలో పడడంతో ఓ చిన్నారి గాయాలపాలైంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు కురబలకోట మండలం, అంగళ్లు పంచాయతీ సర్కార్ తోపునకు చెందిన అఫ్ర అంజుమ్ (3) శుక్రవారం ఉదయం ఆడుకుంటూ వేడినీళ్లలో పడడంతో శరీరం కాలిపోయింది. తల్లిదండ్రులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చిన్నారి కోలుకుంటోంది.

విధి నిర్వహణలో అలసత్వానికి ఇద్దరు డాక్టర్లపై చర్యలు

- ఒకరి సస్పెన్షన్.. మరొకరికి షోకాజ్ నోటీసులు

పెనగలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్లలో రమ్మీ నిమ్మచి సస్పెన్షన్ కాగా మరో డాక్టర్ థౌషిప్‌కు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు డాక్టర్ రమ్మీ నిమ్మచి విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, పలు మార్లు ప్రజల నుంచి అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మరో డాక్టర్ థౌషిప్ కూడా విధులకు ఆలస్యంగా రావడంతోపాటు, అప్పుడప్పుడు గైర్హాజరవుతున్నట్లు కూడా తెలియజేయడంతో ఆయనకు కూడా షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఇరువురు డాక్టర్లు పెనగలూరు పీహెచ్‌సీలో తొలిసారిగా ఉద్యోగంలో చేరారు. ఇటీవలనే రెగ్యులర్ అయినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా పెనగలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పటివరకు పనిచేసిన డాక్టర్లలో ఒకరు సస్పెన్షన్ కావడం, మరొకరికి షోకాజ్ నోటీసు ఇవ్వడం ఇదే తొలిసారి. ఈ విషయం వాస్తవమేనని సీహెచ్‌వో సురేంద్రనాథరాజు వివరించారు.

అవినీతి ఆరోపణల నుంచి ఇన్‌స్పెక్టర్ రవిబాబుకు ఊరట

కలికిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గతంలో లక్కిరెడ్డిపల్లె పోలీసు ఇన్‌స్పెక్టరుగా పనిచేసి ప్రస్తుతం అనంతపురం ఇంటెలిజెన్స్‌లో వున్న పి.రవిబాబుకు ప్రభుత్వం నుంచి ఊరట లభించింది. గతంలో ఆయనపై పడిన నిందను తొలగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. లక్కిరెడ్డిపల్లె సీఐగా పనిచేసే కాలంలో రామాపురం పోలీసు స్టేషన్‌లో 2018లో నమోదైన ఒక కేసునుంచి నిందితుడిని తప్పించడానికి మధ్యవర్తితో రూ.27 వేలకు ఒప్పందం కుదుర్చు కున్నాడని, ఆయన సూచన మేరకు ఆ మొత్తాన్ని రామాపురం హెడ్ కానిస్టేబుల్ తీసుకున్నాడని ఆరోపణ. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికెళ్లడంతో విచారణ చేసి రవిబాబును నిందితుడిగా నిర్ధారించారు. ఈ విషయంపై ఆయన అడిషనల్ డైరెక్టర్ జనరల్‌కు అప్పీలు చేసుకోగా 2021 మార్చి 3న తిరస్కరించారు. తాజాగా ప్రభుత్వం ముందు రివిజన్ పిటిషన్ దాఖలు చేయడంతో డీజీపీ.. రవిబాబుకు అనుకూలంగా ప్రభుత్వానికి నివేదించారు. పూర్వాపరాలను పరిశీలించిన ప్రభుత్వం ఎట్టకేలకు ఆయనపై మోపిన 'నింద'ను తొలగించింది.

ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

బ్రెడ్డు తిని ఐదుగురు విద్యార్థులకు అస్వస్థత

తంబళ్లపల్లె,మార్చి 7(ఆంధ్రజ్యోతి): బ్రెడ్డు తినడంతో ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కోటకొండ ఎంపీపీ పాఠశాల ఆరో తరగతి విద్యార్థులు అరవింద్, బన్నీ, అశ్వనీ, సంధ్య, జగదీష్ శుక్రవారం పాఠశాల విశ్రాంత సమయంలో పాఠశాలకు సమీప దుకాణంలో బ్రెడ్డు తెచ్చుకుని తిన్నారు. కొద్ది సేపటికి వాంతులై అస్వస్థతకు గురయ్యారు. గమనించిన ఉపాధ్యాయురాలు లలిత పక్కనే ఆరోగ్య ఉపకేంద్రంలో ఉన్న ఎంఎల్‌హెచ్‌పి దేవిక, ఏఎన్ఎం గంగులమ్మకు చెప్పడంతో వెంటనే వైద్య సిబ్బంది పాఠశాలకు వెళ్లి చికిత్స చేశారు. కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి అనుపమ, మునికుమార్ హుటాహుటిన పాఠశాల చేరుకుని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సమాచారం అందుకున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య, ఎంఈఓ త్యాగరాజు, నాగసుబ్బరాయుడు పాఠశాలకు వెళ్లి విద్యార్థులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి విద్యార్థులంతా పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు మెడికల్ ఆఫీసర్, ఎంఈఓలు తెలిపారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య, ఎంఈఓ

డ్వాక్రా గ్రూప్ లీడర్ రూ. 12 లక్షల దుర్వినియోగం

మదనపల్లె అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపునకు చెందిన నగదును గ్రూపు లీడర్ స్వాహా చేసిందంటూ ఆ గ్రూపు సభ్యు లు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఈశ్వరమ్మ కాలనీకి చెందిన రాజరాజేశ్వరి గ్రూప్‌లో 10 మంది సభ్యులు ఉండ గా లీడర్‌గా కె. రాధా వ్యవరించేది. గ్రూపు సభ్యులు పొదుపు చేసుకున్న నగదు, మరో గ్రూప్ సభ్యురాలు లక్ష్మీదేవికి చెందిన రూ. 1.2 లక్షలతో సహా రూ. 12 లక్షలతో ఉడాయించింది. దీనికి సంఘమిత్ర వాణి పూర్తి సహకారం అందించిందంటూ ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి కేసు నమోదు చేస్తామని తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. గ్రూప్ సభ్యులు పద్మ, రెడ్డిరాణి, ని ర్మల, చంద్రకళ, లలిత, లక్ష్మీదేవి ు పాల్గొన్నారు.



గ్రూప్ లీడర్‌పై ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

క్యూఆర్ కోడ్ స్కాన్‌తో విద్యుత్ బిల్లుల చెల్లింపు

- ప్రత్యేక యాప్ రూపకల్పన
- వినియోగదారులకు వెసులుబాటు

కురబలకోట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలనే ఆశయంతో ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. సాధారణంగా విద్యుత్ బిల్లులను చెల్లించడానికి వినియోగదారులు చాలా శ్రమించాల్సి ఉంటుంది. గ్రామీణ, పట్టణ,నగర ప్రాంతాల్లో బిల్లుల చెల్లింపు కేంద్రాల వద్ద వినియోగదారులు రద్దీ ఎక్కువగా ఉండడంతో గంటల కొద్దీ క్యూలైన్ లో నిలబడాల్సివచ్చేది.. నిలుచునే ఓపిక లేకపోవడం, ఇతర పనులు ఉండడం, తదితర కారణాలతో మరోసారి చెల్లించవచ్చని అధికశాతం మంది వెళ్ళిపోతుంటారు. తర్వాత ఆ విషయాన్ని మర్చిపోవడంతో సకాలంలో(14రోజుల లోపు) విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోతున్నారు. దీంతో అదనంగా జరిమానాలు భరించాల్సి వచ్చేది. ఈ జరిమానాలు కేటగిరి-2 కు రూ. 150, కేటగిరి-1కు వినియోగదారుడికి వచ్చే బిల్లును బట్టి రూ.25 నుంచి రూ.50 వరకు చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుత పద్ధతిలో చేతిలో సొమ్మున్నా సమయానికి బిల్లులు చెల్లించ లేని వినియోగదారులకు విముక్తి లభించింది. గతంలో ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించే వెసులుబాటు ఉండేది. అయితే వాటిలో పలురకాల సమస్యలు తలెత్తడంతో ఆ పద్ధతికి ప్రభుత్వం స్వస్తి పలికింది. తాజాగా క్యూఆర్ కోడ్ స్కాన్ పద్ధతిని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా సులభంగా ఎక్కడి నుంచైనా బిల్లులను చెల్లించవచ్చును. అయితే విద్యుత్ బకాయిలు ఉన్న వారికి ఇది పని చేయదు. దీంతో వాళ్ళు కార్యాలయానికి వెళ్ళి బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది.



క్యూఆర్ కోడ్‌తో వచ్చిన విద్యుత్ బిల్లు

50శాతం రాయితీతో అదనపు లోడు

వినియోగదారుల సౌకర్యార్థం 50 శాతం రాయితీతో అదనపులోడు పొందే అవకాశాన్ని విద్యుత్ సంస్థ కల్పించింది. సాధారణంగా గృహవినియోగానికి మినిమం వాటేజీకి ఇంటి యజమాని సొమ్ము చెల్లించి ఉంటాడు. ఈ వాటేజీతో ఏసీ, కూలర్, ఫ్రిడ్జ్, హీటర్, గీజర్‌లను వినియోగించడం కదరదు. ఒక వేళ వినియోగిస్తే పరికరాలు కాలిపోయే ప్రమాదం ఉంది. దీంతో వినియోగదారుడికి తీవ్ర నష్టం కలుగుతుంది. అదనపు వాట్స్ పొందితే ఆ సమస్యలను నివారించవచ్చును. ఇందుకోసం గతంలో చెల్లించాల్సిన మొత్తంలో సగం రాయితీ ఇస్తోంది. ఈ మొత్తంతో పాటు అప్లికేషన్ ఫీజు రూ.50, డిపాజిట్ రూ.200చెల్లించాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ శంకర్ రెడ్డి తెలిపారు

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి సురేశ్

రాయచోటిటౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి సిద్దమవుతున్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి సురేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సురేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న బీసీ, ఈబీసీ కేటగిరీలకు చెందిన టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 10 నుంచి ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ కు సొంత జిల్లాలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారు రాయచోటిలోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం లో దరఖాస్తులు పొంది అక్కడే సమర్పించాలన్నారు. ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభ తేదీ తదితర వివరాలు త్వరలో రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అధికారులు తెలియజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు రాజంపేట రోడ్డులోని గిరిజన పాఠశాల వెనుక ఉన్న బీసీ సంక్షేమశాఖ కార్యాలయం లో సంప్రదించాలని తెలిపారు.

నందలూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్

నందలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే స్టేషన్‌లో హరిప్రియ, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌ను పునరుద్దరించారు. కొల్హాపూర్ నుంచి తిరుపతికి వెళ్లే 17416, తిరుపతి నుంచి కొల్హాపూర్‌కు వెళ్లే 17415 హరిప్రియ ఎక్స్‌ప్రెస్, కడప నుంచి విశాఖపట్టణం వెళ్లే 18521, విశాఖపట్టణం నుంచి కడపకు వచ్చే 18522 తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నందలూరులో స్టాపింగ్ రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈనెల 8 నుంచి ఆ రైళ్లను నందలూరులో నిలిపేందుకు రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మండలంలోని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పంట పొలాలకు నెమళ్ల బెడద



పొలాల్లోకి గుంపులు గుంపులుగా వస్తున్న నెమళ్లు

చిన్నమండెం, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లి గ్రామ పంచాయతీలో రైతులకు నెమళ్ల బెడద ఎక్కువైందని రైతులు వాపోతున్నారు. పదుల సంఖ్యలో నెమళ్లు గుంపులుగా పొలాలపై పడి వేరుశనగ, వరి, అలసంద వంటి పైర్లను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రయితే అడవి పందులు, పగలైతే నెమళ్లతో రాత్రింబవళ్లు రైతులు పంటల దగ్గర కావలి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు

ఇద్దరిపై లైంగిక దాడి కేసు నమోదు

నిమ్మనపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లంవారిపల్లెకు చెందిన ఇద్దరిపై రేప్ కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన ఓ మహిళ గత నెల 27న సాయంత్రం నల్లంవారిపల్లికి వచ్చి పాలు పోసి వెళుతుంగా అదే గ్రామానికి చెందిన సురేంద్ర, పల్లపు నాగేంద్ర ఆమెను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. భర్త సాయంతో ఆమె తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితులను అరెస్ట్ చేసి వారిపై లైంగికదాడి కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మదనపల్లె అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): స్థలం, డబ్బు విషయమై ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడ్డారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన సమాచారం మేరకు స్థానిక శేషమహల్ ప్రాంతానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి స్థలం విక్రయిస్తానంటూ జాషువా నుంచి మూడు లక్షల రూపాయలు తీసుకున్నాడు. ఏడాది గడిచినా స్థలం ఇవ్వకపోగా, డబ్బు కూడా వాపసు చేయలేదు. దీంతో గురువారం రాత్రి జాషువా తన కుమారులతో కలిసి వెళ్లి వెంకటరమణను ప్రశ్నించాడు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో జాషువా, అతని కొడుకులు భరత్, జోసెఫ్, మహేష్ గాయపడ్డారు.కుటుంబ సభ్యులు వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ భూములు పరాధీనం

● పట్టించుకోని అధికార యంత్రాంగం
● ఆక్రమణదారులకు సిబ్బంది సహకారం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులాల అభివృద్ధి కోసం ప్రభుత్వం వివిధ పథకాలను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తోంది. ఇందులో స్వయం ఉపాధి కల్పన కోసం రుణాలు ఇవ్వడంతో పాటు భూమిలేని నిరుపేద ఎస్సీ మహిళలకు భూమి కొనుగోలు పథకం కింద వ్యవసాయ భూములను పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా వ్యాపార రంగంలో కూడా ఎస్సీలను ఆర్థికంగా నిలబెట్టేందుకు పలుచోట్ల షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించా రు. వీటిలో ఒక్క వేంపల్లెలో మినహాయిస్తే ఉమ్మడి కడప జిల్లా లోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లు దెబ్బతి న్నాయి. వాటిని పునర్నిర్మించే పనులు చేపట్టకపోవడంతో కొన్నిచోట్ల నేలమట్టం అయినట్లు ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు చెబుతున్నారు. వీటిని పరిరక్షించేందుకు అధికారులు తగిన చొరవ చూపకపోవడంతో అన్యాక్రాంతమవుతున్నాయి. ఎస్సీలలో ఆర్థిక సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కొన్ని దశాబ్దాల క్రితం వ్యాపార సముదాయాల నిర్మాణాలు చేపట్టి వాటి ద్వారా ఎస్సీ యువతకు ఉపాధి కల్పించడం జరిగేది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా తగిన రీతిలో నిధుల కేటాయింపు లేకపోవడంతో జిల్లాలో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

వందలకోట్ల ఆస్తి పరాధీనం

ఎస్సీ సామాజిక వర్గాల్లోని వారికి కోళ్లపెంపకం ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు ఉమ్మడి కడప జిల్లాలో 81.80 ఎకరాల్లో 155 పౌల్ట్రీ కాంప్లెక్స్‌లను 1984-85 ఆర్థిక సంవత్సరంలో నిర్మించారు. ఇవన్నీ కూడా కూలిపోయినట్లు ఎస్సీ కార్పొరేషన్ అధికారయంత్రాంగం చెబుతోంది. దీంతో ఎస్సీ కార్పొరేషన్‌కి సంబంధించిన పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల స్థలాలను ఎస్సీలే కాకుండా ఇతర సామాజిక వర్గాల వారు కూడా ఆక్రమించుకొని అనుభవించుకుంటున్నారు. దెబ్బతిన్న పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల స్థానంలో కొంతమంది రెవెన్యూ వారి ద్వారా రికార్డులు కూడా తమ పేర్లతో పొందినట్లు తెలుస్తోంది.

● రాజంపేట మండలం తాళ్లపాక వద్ద 1984-85 ఆర్థిక సంవత్సరంలో సర్వేనెంబర్ 1162లో 6.72 ఎకరాల్లో 30 షాపుల కెపాసిటీతో ఎస్సీ కార్పొరేషన్ పౌల్ట్రీ కాంప్లెక్స్‌ను నిర్మించింది. ప్రస్తుతం ఆ కాంప్లెక్స్ కుప్పకూలిపోయింది. దీంతో ఇతరులు (ఎస్సీలు కానివారు) తమ పేర్లతో రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించుకున్నట్లు సమాచారం. ఈ స్థలం కడప-తిరుపతి ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో మంచి ధర పలుకుతోంది. ఇక్కడ సెంటు భూమి రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ లెక్కన దాదాపు రూ.80కోట్లు విలువైన స్థలం పరులపాలైనట్లు చర్చ సాగుతోంది.

● పులివెందుల పట్టణంలో 1984-85లో సర్వే నెంబర్ 60-2, 61-2, 62-1లో 12.6 ఎకరాల విస్తీర్ణంలో 22పౌల్ట్రీకాంప్లెక్స్‌లకు నిర్మాణం చేపట్టారు. అది కూడా కూలిపోవడంతో స్థానికంగా ఉన్న ఓ నేత తమ స్థలంలో కలిపేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు సర్వే నిర్వహించి ఆ స్థలం ఎస్సీ కార్పొరేషన్‌కి వస్తుందంటే.. తాను వదిలేందుకు సిద్ధంగా ఉన్నానని ఆ నేత కుటుంబీకులు చెప్పినప్పటికీ సమగ్రంగా సర్వే నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా లేరని సమాచారం.

● చిట్వేలి మండలంలోని గొల్లపల్లెలో సర్వే నెంబర్ 1387-4లో 11.9 ఎకరాల్లో 24, వెంకట్‌రాజుపల్లె సర్వేనెంబర్ 848-బి1, బి-2లలో 9.41ఎకరాల స్థలంలో 19, మల్లంపల్లెలో 146-2లో 9.64ఎకరాలలో 20, లక్కిరెడ్డిపల్లె మండలంలోని బూడిగుంటపల్లెలో సర్వేనెంబర్ 135-3లో 13.52ఎకరాలలో 34, టి.సుండుపల్లె మండలంలోని జీకె రాచపల్లెలో 9, 51, 968లలో 10.29ఎకరాలలో 20, కొండాపురంలో 7.92 ఎకరాలలో 16 పౌల్ట్రీ కాంప్లెక్స్‌లు నిర్మించారు. అయితే అవన్నీ కూలిపోయినట్లు అధికార యంత్రాంగం చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో దాదాపు వీటిల్లో అధిక భాగం ఆక్రమణలకు గురైనట్లు సమాచారం. వేంపల్లెలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ మాత్రం లబ్ధిదారులు వినియోగించుకుంటున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా...

రాష్ట్రంలోని ఏ జిల్లాలో లేని విధంగా.. ఒక్క కడప జిల్లాలో మాత్ర మే జిల్లా హరిజన డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు భూమి ఉండేది. 1974లో ఎస్సీ కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత ఆ భూమిపై హక్కులు పొందినట్లు సమాచారం. ఈమేరకు ఉమ్మడి కడప జిల్లాకు సంబం ధించిన 3505 ఎకరాల భూమిని కొన్ని దశాబ్దాల క్రితం 1916 మందికి పంపిణీ చేశారు. అయితే ఏక్‌సాల్ పర్మిషన్ మాత్రమే ఇవ్వడం వల్ల ఆ భూములు ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోనే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం ఎస్సీలు కాకుండా ఇతర సామాజిక వర్గాల వారు ఈ భూములను అనుభవిస్తున్న పరిస్థితి. దురాక్రమణలో ఉన్న ఈ



చిట్వేలి మండలం గొల్లపల్లె వద్ద శిథిలావస్థకు చేరుకున్న పౌల్ట్రీ కాంప్లెక్స్

భూములను తిరిగి ఎస్సీ కార్పొరేషన్ స్వాధీనం చేసుకొని అర్హులైన దళితులకు పంపిణీ చేయాలని అధికారులకు వినతులు అందాయి.

ఆక్రమణదారులకు సిబ్బంది సహకారం

ఎస్సీ కార్పొరేషన్‌లో గతంలో పనిచేసిన కొంతమంది సిబ్బంది ఆ కార్పొరేషన్‌కు సంబంధించిన విలువైన స్థలాల సమాచారాన్ని అందజేసి సొమ్ము చేసుకున్నట్లు చర్చ సాగుతోంది. అంతేకాకుండా చాలా వరకు రికార్డులు కూడా అందుబాటులో లేకపోవడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటే ఆలోచన చేయాల్సిన పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో దృష్టి సారిస్తే రికార్డులను తిరిగి పొందే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయమై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అవినీతి అధికారులపై కలెక్టర్ కొరడా

● తాజాగా మరో ఇద్దరిపై వేటు
● పంచాయతీ సెక్రటరీ పుల్లారెడ్డి సస్పెన్షన్
● కంప్యూటర్ అపరేటర్ హనీఫ్ బాష సర్వీస్ నుంచి తొలగింపు

కడప రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ అవినీతి అధికారులపై జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కొరడా ఝుళిపిస్తున్నారు. ఇప్పటికే వేంపల్లె, ఒంటిమిట్ట, తొండూరు మండలాల్లో గ్రామ పంచాయతీ, మండల పరిషత్ నిధుల దుర్వినియోగానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యులైన ఎంపీడీవో, ఏవో, ఈవోపీఆర్‌డీ, కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ సెక్రటరీలతో సహా 7 మందికి పైగా సస్పెండ్ చేశారు. తాజాగా రాజుపాళెం మండలం ఏరువపాలెం గ్రామ పంచాయతీ గ్రేడ్- 3 సెక్రటరీ(ప్రస్తుతం డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్) బి.పుల్లారెడ్డిని సెస్పెండ్ చేశారు. అలాగే చాపాడు మండలం కంప్యూటర్ ఆపరేటర్ షేక్ హనీఫ్ బాషను విధుల నుంచి తొలగించారు. పుల్లారెడ్డి వైసీపీ ప్రభుత్వంలో ఏరువపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీగా ఉన్న సమయంలో గ్రామ పంచాయతీ నిధులలోని రూ.4,25,986ల ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో సదరు నివేదికను ఈ-ఆఫీస్ ద్వారా కలెక్టర్‌కు పంపగా... సీసీఏ రూల్స్ 1991లోని రూల్ 8 కింద సర్వీస్ నుంచి సస్పెండ్ చేశారు. అలాగే చాపాడు మండలంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న షేక్ హనీఫ్ బాష బద్రిపల్లి గ్రామ పంచాయతీ నిధులలో రూ.2,56,325లు మేర ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో కలెక్టర్ అతన్ని సర్వీస్ నుంచి తొలగించి క్రిమినల్ చర్యలకు ఆదేశించారు.

కడప ఓరియంటల్ హైస్కూల్ పెండింగ్ బిల్లులకు నిధులు విడుదల

కలికిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కడప పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఓరియంటల్ హైస్కూల్ అభివృద్ధి పనులకు పెండింగ్ బిల్లుల చెల్లింపు కోసం రూ.20.33 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పనులు జరిగినా వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు చెల్లించకపోవడంతో హై కోర్టులో 2023లో రిట్ పిటిషన్ దాఖలైంది. తరువాత బిల్లులు చెల్లించాలన్న కోర్టు ఉత్తర్వులు అమలుకాకపోవడంతో కోర్టు ధిక్కార కేసు నమోదైంది. మొత్తం వ్యవహారాన్ని పరిశీలించిన ఆర్థిక శాఖ పెండింగ్ బిల్లులు చెల్లించడానికి 2025 ఫిబ్రవరి 26న ఆమోదం తెలిపింది. ఆ మేరకు అదనపు బడ్జెట్ నిధుల నుంచి పెండింగ్ బిల్లులు చెల్లించడానికి అనుమతిస్తూ పాఠ శాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

12న వైవీయూ వ్యవస్థాపక కళాశాల దినోత్సవం

కడప ఎడ్యుకేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం వ్యవస్థాపక కళాశాల దినోత్సవం ఈనెల 12వ తేదీ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి వెల్లడించారు. నిర్వహణ ఏర్పాట్లు, పీజీ 2,4 సెమిస్టర్ల పరీక్షల తేదీల నిర్ణయం, సిలబస్ తదితర విషయాలపై ఆయా విభాగాధిపతులతో శుక్రవారం భేటి అయ్యారు.

పుస్తకాల భారం తగ్గించేలా నిర్ణయం తీసుకోడం హర్షణీయం

కడప ఎడ్యుకేషన్,మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పుస్తకాల భారం తగ్గించేలా సెమిస్టర్‌ల వారీగా పుస్తకాలు బైండింగ్ చేసి ఇస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. విద్యార్థులకు పుస్తకాల భరాం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని.. ఈ భారాన్ని తగ్గించాలంటూ తాము ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుస్తకా లను సెమిస్టర్ల వారీగా బైండింగ్ చేయించి పంపిణీ చేయించడంతో పాటు నాణ్యమైన విద్యాకానుక కిట్లను అందిస్తామని ప్రకటించడం స్వాగతించదగ్గ విషయమన్నారు. వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని పదివేల పాఠశాలల్లో అమలు చేస్తున్నట్లు మంత్రి చెప్పారని, అయితే ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి తగ్గిస్తే ఇది సఫలీకృతం అవుతుందన్నారు.

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు



అరెస్టు చేసిన నిందితుడిని చూపుతున్న సీఐ, ఎస్ఐలు

పెండ్లిమర్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగనపల్లె గ్రామంలో ఈనెల 2వ తేదీ నాగులుగారి లూర్దు మేరి (50) అనే మహిళ హత్యకు గురైం ది. మృతురాలి కూతురు నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధు సూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని మేరీని ఆమె భర్త సుబ్బరాయుడు తలను గోడకు కొట్టడంతో మృతి చెందినట్లు విచారణలో తేలింది. నిందితుడు రెవెన్యూ అధికారుల ద్వారా పోలీసుస్టేషన్‌కు వచ్చి తన నేరాన్ని అంగీకరించ డంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పెట్టినట్లు సీఐ చల్లని దొర, ఎస్ఐ మధుసూదన్ రెడ్డిలు తెలిపారు.

అంగన్వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం

● సీడీపీవో వేధింపులే కారణమంటూ వివరణ

కాశినాయన మార్చి 7 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కోడిగుడ్లపాడు అంగన్వాడీ టీచర్ గురుదేవి శక్రవారం విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను పోరుమామిళ్ల ప్రభుత్వ వైద్య శాలకు తరలించి చికిత్స అందించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. పోరుమామిళ్ల ఐసీడీఎస్ సీడీపీవో వేధింపులే తన ఆత్మహత్యాయత్నానికి కారణమని బాధితురాలు గురుదేవి మీడియా ఎదుట వాపోయారు.

వేధింపులకు పాల్పడలేదు.. సీడీపీఓ

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తాను లంచం డిమాండ్ చేసి వేధింపులకు పాల్పడటం వల్లనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు అంగన్వాడీ కార్యకర్త చేస్తున్న ఆరోపణలు సరికాదని పోరుమామిళ్ల సీడీపీఓ లక్ష్మీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడీ సెంటర్ కోడ్ మార్పు విషయంలో కార్యకర్త తనను సంప్రదించారని.. ఆ కోడ్ మార్పే అంశం తన పరిధిలోకి రాదని చెప్పానన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పినప్పటికీ కార్యకర్తతో పాటు ఆమె కుమార్తె బెదరింపులకు పాల్పడ్డారన్నారు. తన తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుందని ముందుగానే హెచ్చరించినట్లు ఆమె వివరించారు. ఇదే అంశాన్ని ఒక రోజు ముందుగానే పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లానని తెలిపారు.

వన్యప్రాణిని వేటాడిన వ్యక్తికి రిమాండ్

వేంపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఫారెస్టు బీట్ కప్పలమడుగు వద్ద కొండ గొర్రె (వన్యప్రాణి)ను వేటాడిన చింతకాయల శ్రీరాములును అరెస్టు చేసి పులివెందుల కోర్టులో హాజరుపర్చినట్లు రేంజర్ బాలసుబ్రమణ్యం తెలిపారు. వేటా డేందుకు వెళ్లారని సమాచారం అందడంతో దాడి చేసి శ్రీరాము లును అదుపులోకి తీసుకొని నాటుతుపాకీని, 4 కేజీల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గంజాయి అక్రమ రవాణా కట్టడికి చర్యలు



ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న సీఐలు యుగంధర్, రమణారెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో గంజాయి అక్రమ రవాణా కట్టడి చేసేందుకు పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో బాగంగా శుక్రవారం స్థానిక టూటౌన్ ఏరియాలో ఉన్న ట్రాన్స్‌పోర్టు కార్యాల యాలను గొడౌన్‌లను డిస్ట్రిక్ నార్కోటిక్ కంట్రోల్ సెల్ (డీఎన్‌సీసీ) టూటౌన్ పోలీసులు సంయుక్తంగా తనిఖీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు ట్రాన్స్‌పోర్టులలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడినా, సహకరించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ యుగంధర్, డీఎన్‌సీసీ సీఐ రమణారెడ్డిలు ట్రాన్స్‌పోర్టు యజమానులను హెచ్చరించారు. పార్శిళ్లలో ఎక్కడైనా గంజాయి అనవాళ్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మల్లికార్జునరెడ్డి మృతదేహం

దువ్వూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు, క్రీస్తురాజపురం మార్గమధ్యంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తుమ్మల మల్లికార్జునరెడ్డి (39) అనే వ్యక్తి మృతి చెందాడు. దువ్వూరు నుంచి తన సొంత గ్రామం గుడిపాడుకు బైక్‌పై వెళుతూ అదుపు తప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

ఎస్ఎస్‌సీ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్

● ఈవిద్యాసంవత్సరం నుంచి ప్రారంభం
● మార్చి 20, 25న పరీక్షలు

వల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షలంటే ప్రతి విద్యార్థికి భయం ఉంటుంది. కొంత మంది విద్యార్థులకు ఎక్కువసార్లు డ్రిల్లింగ్ చేయడం వల్ల మాత్రమే గుర్తుండే అవకాశం ఉంటుంది. మరి కొంతమంది విద్యార్థులు నేర్చుకునే విషయాన్ని పరీక్ష రూపంలో చూపించడంలో అనేక సమస్యలు ఎదుర్కొంటారు. ఇంకొందరు విద్యార్థులు ఎక్కువగా వీక్‌గా ఉన్న సబ్జెక్టుల్లో ప్రీఫైనల్, గ్రాండ్ టెస్టువంటి పరీక్షలు సాధన చేయడం ద్వారా మంచిమార్కులు సాధించేందుకు ఇదొక చక్కటి అవకాశం. పరీక్షలపై విద్యార్థులకు ఉన్న అనేక అపోహలను పోగొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరంలో ఎస్ఎస్‌సీ విద్యార్థులకు గ్రాండ్ టెస్టు నిర్వహిస్తుంది. జిల్లాలో 27,800 మంది విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం పరీక్షలు రాయనున్నారు. మార్చి 17 నుంచి 31 వరకు ఎస్ఎస్‌సీ పరీక్షలను నిర్వహిస్తారు.

రీసైక్లింగ్ పునశ్చరణ : డీఈవో

విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్న సందర్భంగా పదే పదే ప్రాక్టీసు పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో పున శ్చరణ పెరిగి రీసైక్లింగ్ అలవాటు పడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఈ గ్రాండ్ టెస్టు వల్ల పరీక్షల సమయంలో సమయాన్ని ఎలా ఉపయోగించు కోవాలో తెలుస్తుందన్నారు. ఏ ప్రశ్నకు ఏ జవాబు రాయాలనేది విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందన్నారు. పరీక్షలు రాసేటప్పుడు భయం తొలుగు తుందన్నారు. దీంతో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరగడంతో పాటు మార్కులు అత్యధికంగా తెచ్చుకునేందకు ప్రీఫైనల్, గ్రాండ్ టెస్టు వంటి పరీక్షలు ఎంతో ఉపయోగపడుతాయి.

గుండె పోటుతో ఉపాధి కూలి మృతి



వల్లూరు మార్చి 7, (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని అంబవరం గ్రామంలో శుక్రవారం ఉపాధి పనిచేస్తున్న మహిళా కూలీ చెంచుగారి పుల్లమ్మ గుండెపోటుతో మృతి చెందినట్లు ఏపీఓ సుధా రాణి తెలిపారు. ఉదయం ఉపాధి పనికి వెళ్లిన పుల్లమ్మ గుండెల్లో నొప్పి వస్తుందని చెప్పడంతో ఆమె బంధువులు ఇంటివద్దకు తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని ఏపీఓతో పాటు ఉపాధి సిబ్బంది సంద ర్శించి నివాళి అర్పించారు.

చాపకింద నీరులా...

● జోరుగా సాగుతున్న మట్కా దందా
● టెక్నాలజీని వాడుకుంటున్న బీటర్లు
● పోలీసులకు సవాల్‌గా మారిన వ్యవహారం

కడప క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రూ.వంద కడితే వెయ్యి రూపాయలు వస్తుందనే ఆశతో కొందరు... వెయ్యి కడితే లక్షల్లో వస్తుందంటూ మరికొందరు అత్యాశతో మట్కా ఊబిలో చిక్కుకొని జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ఈ మట్కాలో పోయేదే కానీ వచ్చేది లేదనేది తెలియకపోవడంతో ఎక్కు వగా ఈ దందాలో పేద, మధ్యతరగతి వారే బలవుతున్నారు. వివరాల్లోకి వెళితే...

జిల్లా వ్యాప్తంగా మట్కా జూదం రోజురోజుకూ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఈ మట్కా ఊబిలో పేద మధ్య తరగతి వారితో పాటు యువత, చిరుద్యోగులు చిక్కుకుపోతున్నారు. ఇక ఎక్కువగా కూలీ నాలీ పనులు చేసుకునే వారు రోజంతా సంపాదించిన డబ్బులు మట్కా జూదంలో పోగొట్టుకుంటున్నారు.

జిల్లాలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు, బద్వేలు, కమలాపురం నియోజకవర్గాల్లో మట్కా జోరుగా సాగుతున్నట్లు సమాచారం.



టెక్నాలజీని వాడుకుంటున్న బీటర్లు

ఒకప్పుడు మట్కా బీటర్లు ఎక్కడో ఒక ప్రదేశంలో ఉంటూ చిన్న చిన్న చీటీల ద్వారా ఈ జూదాన్ని నిర్వహించే వారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరు స్మార్ట్ ఫోను వినియో గిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన మట్కా బీటర్లు టెక్నాలజీని ఉపయోగిస్తూ గుట్టుచప్పుడు కాకుండా ఈ దందా నడుపుతున్నారు. దీంతో మట్కా నిర్వాహకులను పట్టుకోవాలంటే పోలీసులకు సవాల్‌గా మారింది. ఇక మట్కా బీటర్లు మట్కా వేసే వారికి ఇన్ స్ట్రాగ్రామ్‌లో ఐడీలు పెట్టి అందులో మట్కా నెంబర్లు సేకరిస్తున్నారు. ఎవరైనా పట్టుబడితే తెలివిగా ఇన్‌స్టా గ్రామ్‌లోని ఐడీని తొలగిస్తున్నారు. దీంతో వీరిని గుర్తించడం సాధ్యపడటం లేదు.

కొరవడిన నిఘా

మట్కాదందాను నిర్మూలించడంలో పోలీసులు విఫలమవుతున్నారు. మట్కా బీటర్లు టెక్నాలజీని వాడుకోవడం, కొత్తకొత్త వ్యక్తులు మట్కా బీటర్లుగా అవతార మెత్తుతుండటంతో వీరిని గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. గతంలో మట్కా అంటే ఫలానా వ్యక్తులని గుర్తింపు ఉండడంతో వారిపై నిఘాఉంచి పట్టుకునేవారు. అయితే ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ల ద్వారా ఈ దందా నడుపుతుండడంతో పోలీసు నిఘా కొరవడినట్లు స్పష్టమవుతుంది. కాగా, కొన్ని చోట్ల బహి రంగంగానే దుకాణాల్లో మట్కా స్లిప్పులు రాస్తు న్నట్లు తెలుస్తుంది.

బతికుండగానే డెత్ సర్టిఫికెట్ సృష్టించి..

● స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు
● పోలీసులకు బాధిత మహిళ ఫిర్యాదు

మైదుకూరు రూరల్, మార్చి7 (ఆంధ్ర జ్యోతి): బతికుండగానే చనిపోయినట్లు దొంగసర్టిఫికెట్ సృష్టించి తన స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారంటూ మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు.. మైదుకూరు-నంద్యాల రోడ్డులో 1149, 1158 సర్వే నెంబర్లలో 10సెంట్ల స్థలాన్ని కడపకు చెందిన అహల్య, ఆమె కుమార్తె అమరావతి 1998 సంవత్సరంలో యెలిశెట్టి పిచ్చమ్మ, ఆమె కుమార్తెలు ఉషారాణి, సుబ్బరత్నమ్మ, గీతాకుమారిల వద్ద కొనుగోలు చేశారు. కాగా, అదే స్థలాన్ని యెలిశెట్టి పిచ్చమ్మ వారి కుమార్తెలు 2011లో చింతకుంట షబ్బీర్ హుసేన్‌కు అమ్మారు. అహల్యా, అమరావతిల మధ్య మనస్పర్థలు ఉన్నాయని తెలుసుకున్న షబ్బీర్‌హుసేన్ అమరావతితో ఒప్పందం కుదుర్చుకొని అహల్య చనిపోయినట్లు డెత్ సరిఫికెట్ సృష్టించి, షబ్బీర్ హుసేన్ భార్య రహమ్మతున్నీషా పేరున 2022లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయాన్ని ఆన్‌లైన్‌లో చెక్ చేసి అహల్య మైదుకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

చిత్రం చెప్పిన సమస్య

రాజంపేట పట్టణంలో మురుగు కాలువలపై రక్షణ బండలు లేవు. నూనెవారిపల్లె, సాయి నగర్, విద్యుత్‌నగర్, ఈడిగపాలెం, అమ్మవారి శాల వీధి తదితర ప్రాంతాల్లో ఈ దుస్థితి నెలకొంది. అధికారులూ... కాస్త ఇటు చూడండి సారూ...

- రాజంపేట టౌన్, (ఆంధ్రజ్యోతి)



రాజంపేట పట్టణం నూనెవారిపల్లెలో రహదారికి పక్కనే ఉన్న మురుగు కాలువపై రక్షణ బండలు లేని దృశ్యం



విద్యుత్ నగర్‌లోని కాలువ దుస్థితి



అక్షర స్కూల్ సమీపంలో మోరీ దుస్థితి



వ్యర్థాలతో నిండిన అమ్మవారిశాల వద్ద ఉన్న కాలువ

ప్రతి మహిళా లక్ష్యాన్ని అధిగమించాలి

రాయచోటిటౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా నిర్దేశిత లక్ష్యాన్ని పెట్టుకుని దాన్ని నిర్ణీత సమయంలో అధిగమించాలని ఐసీడీఎస్ సీడీపీవో సుగుణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శ్రామిక మహిళా సంఘం, సీఐటీయూ, ఐద్వా రంగాల ఉమ్మడి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు.

రాజంపేట టౌన్: మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.పరిమిళ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

రాయచోటిటౌన్: అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహించాలని స్టేట్ బ్యాంక్ రాయచోటిశాఖ చీఫ్ మేనేజర్ జగదీశ్ అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాయచోటి ప్రధాన బ్రాంచ్‌లో సాయిప్రశాంత్ హాస్పిటల్, డాక్టర్ అంగర్వాల్ కంటి ఆసుపత్రి వారు సంయుక్తంగా ఖాతాదారులు, ఇతరులకు సుమారు 200 మందికి ఉచితంగా జనరల్ హెల్త్ చెకప్‌తో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు.

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో...

రాజంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో శుక్రవారం రాత్రి జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళా యూనివర్శిటీ రిజిస్ట్రార్ పి.పద్మ, అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు శ్రీమతి భావ్య, ఏజీపీ మౌనిక, అన్నమాచార్య విద్యా సంస్థల ఛాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, ప్రోచాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, ఉప కులపతి సాయిబాబారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, రిజిస్ట్రార్ ఎస్.మల్లికార్జునరావు, డాక్టర్ గౌతమి పాల్గొన్నారు.

రామాపురం: సూర్యనారాయణపురం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతమ్మ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు.

లక్కిరెడ్డిపల్లె: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మద్దిరేవుల సర్పంచు చంద్రమ్మ పేర్కొన్నారు. మద్దిరేవులలో డ్వాక్రా సంఘాలతో సమావేశం నిర్వహించారు.

డిప్లమా కోర్సులకు ప్రభుత్వ అనుమతి



మాట్లాడుతున్న బిట్స్ కళాశాల కరస్పాండెంట్ మన్నూరు భాస్కర్

రామాపురం, మార్చి7(ఆంధ్రజ్యోతి): భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్)లో డిప్లొమా కోర్సులను నడపడానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని బిట్స్ కాలేజ్ కరస్పాండెంట్ మన్నూరు భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ మేరకు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (60 సీట్లు), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (60 సీట్లు), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (60సీట్లు), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (60 సీట్లు) గల డిప్లొమా కోర్సులను ప్రారంభించవచ్చని తెలిపారు.

అధ్యక్షా... కోడూరు సమస్యలు మీ దృష్టికి...

- అసెంబ్లీలో కోడూరు ఎమ్మెల్యే



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అధ్యక్షా రైల్వేకోడూరు సమస్యలు వినండి అంటూ కోడూరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ శుక్రవారం అసెంబ్లీలో కోడూరు సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు సరిగ్గా లేవని, రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదని తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది కొరత ఉందన్నారు. డయాలసిస్ రోగులు తిరుపతి, రాజంపేట, కడపకు వెళ్లాల్సి వస్తోందన్నారు. నియోజకవర్గంలో చాలామంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని, కోడూరు పట్టణంలో ఒక డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించి కోడూరు ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు.

గృహ నిర్మాణాలను అడ్డుకున్న వైసీపీ నాయకులు

- ఆ ప్రాంతాన్ని పరిశీలించిన వీఆర్వో

సిద్దవటం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లె గ్రామం పెద్దపల్లె రెవెన్యూ సర్వేనంబరు 936/ఎ లో గృహం నిర్మించుకోవడానికి 2019లో రెవెన్యూ అధికారులు తమకు ఒక్కొక్కరికి మూడు సెంట్ల చొప్పునమంజూరు చేశారని వెంకటసుబ్బయ్య, శివజ్యోతి తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా 2018లో పక్కా గృహాలు మంజూరు చేశారన్నారు. ఆ స్థలాన్ని వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారని తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేయగా ఆ ప్రాంతాన్ని శుక్రవారం వీఆర్వో శివశంకర్ పరిశీలించారు. ఈ విషయమై ఇన్‌చార్జ్ తహసీల్దారు మాధవీలతను వివరణ కోరగా సర్వే నంబరు 936/ఎ లో స్థలం పెండింగ్‌లో ఉందని, విచారించి బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: టీడీపీ



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నేత లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాసాపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాఫెడ్ ఆధ్వర్యంలో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలో కంది పండించి ఒక క్వింటాల్ రూ.7,550తో కొనుగోలు చేసేందుకు అనుమతించిందన్నారు. నేటి నుంచి అన్నమయ్య జిల్లా పరిధిలోని రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, నిమ్మనపల్లి, మొలకలచెరువు కేంద్రాల్లో కందుల కొనుగోలు ప్రక్రియను ప్రారంభించామన్నారు. రైతులు రైతు సేవ కేంద్రంలో తమ పేర్లను నమోదు చేయించుకొని కందుల కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించుకోవచ్చునన్నారు. పూర్తి వివరాల కోసం 90525 67983కు ఫోన్ చేయాలని కోరారు.

సంక్షిప్తం

అక్రమ గృహ నిర్మాణాలను అడ్డుకున్న అధికారులు

సిద్దవటం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాఖరాజుపల్లె రెవెన్యూ ఉప్పరపల్లె గ్రామంలో అక్రమంగా చేపట్టిన గృహనిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. వీఆర్వో శివశంకర్ మాట్లాడుతూ సర్వేనంబరు 424/2లో మూడు సెంట్ల స్థలంలో నిర్మాణాలు చేపట్టగా నిలుపుదల చేశామన్నారు. కాగా మండలంలోని ఉప్పరపల్లె గ్రామం శాఖరాజుపల్లె రెవెన్యూ సర్వే నంబరు 521/1, 422, 421/1, 424 ప్రభుత్వ స్థలం అని, ఆ ప్రదేశాల్లో నిర్మాణాలు చేపట్టకూడదని వీఆర్వో తెలిపారు.వీఆర్ఏ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

104 ద్వారా వైద్య సేవలు

ఓబులవారిపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోవిందంపల్లె గ్రామ పంచాయతీలో 104 ద్వారా వైద్యసేవలు నిర్వహించినట్లు వై.కోట ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ నవీన్ తెలిపారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, షుగరు, బీపీ, సాధారణ జ్వరాలు వంటి వ్యాధులకు వైద్యం అందించినట్లు తెలిపారు.

'ఎమ్మెల్యేపై విమర్శలు సరికాదు'

సుండుపల్లె, మార్చి7(ఆంధ్రజ్యోతి): రాజంపేట వైసీపీ ఎమ్మెల్యేపై విమర్శలు సరికాదని వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆరంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విమర్శించడం సరికాదన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ

పెనగలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కుట్టు మిషన్ శిక్షణకు ఆసక్తి గల బీసీ, ఈబీసీ కులాలకు చెందిన మహిళలు ఈ నెల 10 నుంచి మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.విజయరావు తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు నకళ్లను పొందుపరచాలన్నారు.

శ్మశాన స్థలం అన్యాక్రాంతం

సిద్దవటం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్.రాజంపేట ఎస్సీ కాలనీ శ్మశాన స్థలాన్ని కొందరు అన్యాక్రాంతం చేయడంతో స్థానికులు మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత దృష్టికి తీసుకెళ్లారు. ఆక్రమణలను తొలగిస్తామని ఆమె అన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

రామాపురం, మార్చి7(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య సత్వరం పరిష్కరిస్తామని టీడీపీ నియోజకవర్గ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాగునీటి బోరును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నీటి సమస్య ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకోవడంతో వెంటనే మంత్రి బోరు మోటారును ఏర్పాటు చేసి ప్రారంభించార న్నారు.

ప్రతి రైతూ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలి

సంబేపల్లె, మార్చి7(ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాసుబుక్కు కలిగిన రైతులందరూ తమకు సంబంధించిన రైతు సేవా కేంద్రాల్లో ఏపీఆఫ్ఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కిశోర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం దుద్యాల గ్రామం వడ్డెపల్లెలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

గాయపడిన వ్యక్తికి పరామర్శ

రామాపురం, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన శ్రీనివాసులు, సుబ్బరాయుడులు రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో శుక్రవారం వారి ఇంటికి వెళ్లి మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే కోలుకోవాలన్నారు.

తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి: సీపీఐ

రాయచోటి టౌన్,మార్చి7(ఆంధ్ర జ్యోతి): రాయచోటి మండల పరిధిలోని యండపల్లి గ్రామం పెద్దకాల్వపల్లిలో తీవ్రమైన తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బాలకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దకాల్వపల్లిలో ఉన్న వాటర్ స్కీమ్ బోరును పరిశీలించారు.

క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ ప్రమాణ స్వీకారం

రాజంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : క్షత్రియ కార్పొరేషన్ ఎండీ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్ సూర్యనారాయణరాజు, డైరెక్టర్ అద్దేపల్లె ప్రతాప్‌రాజు విజయవాడలోని ఎస్ఎల్వీ గ్రాండ్‌లో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను చైర్మన్‌గా, డైరెక్టర్‌గా ఎన్నుకున్న క్షత్రీయ సంఘ ఎండీ మహేశ్వరొరెడ్డికి, సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ నందలూరు సీనియర్ నేత గంటా గోపీ, సుందర్ కుమార్‌రాజు పాల్గొన్నారు.

నేడు యల్లమ్మ తల్లి తిరునాళ్లు

సుండుపల్లె, మార్చి7(ఆంధ్రజ్యోతి): చెన్నంశెట్టిపల్లి సమీపంలో వెలిసిన యల్లమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ప్రత్యేక పూజలతో పాటు అంగరంగ వైభవంగా తిరుణాల మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పుస్తక నిర్వహణ తప్పనిసరి

వీరబల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలు క్రమం తప్పకుండా నెలవారీ సమావేశాలు జరుపుకుని సమావేశాల పుస్తకం, వ్యక్తిగత పాస్‌బుక్స్, అప్పు లెడ్జర్‌లో నమోదు చేయాలని వెలుగు ఏపీఎం ఖాదర్‌వలి అన్నారు. శుక్రవారం పెద్దివీడు ఎలకచెట్టుపల్లిలోని సంఘం సభ్యులతో సమావేశంలో మాట్లాడారు. సీసీ కృష్ణయ్య, వీవోఏ హేమలత, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

పెనగలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి:ఆదర్శ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ప్రిన్సిపాల్ సహజబ్లెస్సీ అధ్యక్షతన కంటి పరీక్షలు జరిగాయి. సహాయ కంటివైద్యుడు చంద్రశేఖర్‌రెడ్డి దృష్టి లోపం ఉన్న 37 మంది విద్యార్థులను గుర్తించి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ

చిట్వేలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్ష ఏబీసీ కేంద్రాలను అన్నమయ్య జిల్లా ఉప విద్యాశాఖాధికారి శివప్రకాషరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు.విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా పరీక్షలు నిర్వహించాలన్నారు.

పట్టించుకోండి సారూ...



రైల్వేకోడూరు మండలం బయనపల్లె చెరువు గట్టున చాలా ఏళ్ల క్రితం విద్యుత్ స్తంభాలు నాటారు. ఇవి హై పవర్ విద్యుత్ లైన్లు. తీగలు విద్యుత్ స్తంభానికి పూర్తిగా అల్లుకున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- రైల్వేకోడూరు, (ఆంధ్రజ్యోతి)



నేటి నుండి వీరబల్లి గంగమ్మ జాతర

వీరబల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వీరబల్లిలోని గంగమ్మ ఆలయంలో 8వ తేదీ శనివారం నుంచి జాతర జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఉంటాయని, రాత్రివేళ వచ్చిన భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. అనంతరం కుంకుమ బండిని ప్రత్యేకంగా అలంకరించి డప్పువాయిద్యాలు, బాణా సంచాల మధ్య వీరబల్లిలోని పురవీధుల్లో ఊరేగింపు ఉంటుందన్నారు.

జూదరుల అరెస్టు.. నగదు స్వాధీనం

రామాపురం, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లెలో శుక్రవారం రాత్రి జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు రామాపురం ఎస్ఐ వీవీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.20,700 నగదు, ఒక కారు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసున్నట్లు ఆయన వివరించారు.

విద్యాసంస్థల సమీపంలో మద్యం షాపులు వద్దు: ఏఎస్ఎఫ్

రాయచోటిటౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల సమీపంలో మద్యం షాపులు వద్దని ఏఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పసుపులేటి కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. శుక్రవారం వారు రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాయచోటి పట్టణం చిత్తూరు రోడ్డులో గల బ్రాందీ షాప్‌ను మదనపల్లి రోడ్డులోని విద్యా సంస్థల సమీపంలోకి మార్చవద్దన్నారు. అక్కడ కొన్ని సంవత్సరాలుగా పద్మావతి బాలికల జూనియర్ కళాశాలతో పాటు రాజు హైస్కూల్, భాష్యం స్కూల్, శ్రీచైతన్య స్కూల్ వంటి విద్యా సంస్థల్లో వేలాది మంది విద్యను అభ్యసిస్తున్నారన్నారు. అక్కడ బ్రాందీ షాపు పెడితే ఆందోళనకు దిగుతామన్నారు. ఏఐఎస్ఎఫ్ రాయచోటి నియోజకవర్గ నాయకులు నారాయణ, శ్రీకాంత్, మధు, శ్రీను, రాగూర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అధికారులు చొరవ చూపాలి: కేకే చౌదరి



ప్రజల వినతులను తెలుసుకుంటున్న కేకే చౌదరి

రైల్వేకోడూరు రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారలు చొరవ చూపాలని రాష్ట్ర ఖాధి, గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ కె.కె.చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను విని వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారించాలని కోరారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో కార్యకర్తలకు సీఎం అవకాశం కల్పిస్తారన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పెనగలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మామిడి రైతులు తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి సాధించవచ్చునని కలికిరి కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం రాజంపేట ఉద్యానశాఖ అధికారి సురేష్‌బాబు అధ్యక్షతన కట్టవారిపల్లె పరిధిలోని మామిడి రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.మామిడి ఎక్స్పోర్టర్ పవన్‌కుమార్, జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్రబాబు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.



'పథకం ప్రకారమే దాడి చేశారు'

రాజంపేట టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో జరిగిన వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంలో హిందువులపై దాడి పథకం ప్రకారమే జరిగిందని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పోకల ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందువులు తలపెట్టిన ఉత్సవాలకు ముస్లిం నేతలు అడ్డుకోవడం దారుణమన్నారు. వీహెచ్‌పీ నేతలు శ్రీనివాసులునాయుడు, జయసింహ, రెడ్డిరాజు పాల్గొన్నారు.

3, 4, 5 తరగతుల విలీనాన్ని ఆపాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

రాజంపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట మండలం పెద్దకొత్తపల్లె ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విలీనాన్ని ఆపాలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పెద్దకొత్తపల్లె పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఎం.రమాదేవి, సభ్యులు, తల్లిదండ్రులు కోరారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో ఏగ్రీవంగా తీర్మానించారు. చిన్న పిల్లలను అంతదూరం పంపించేటప్పుడు రహదారుల్లో వాహనాల వేగం, రద్దీ దృష్ట్యా ప్రమాదమని, దీంతో బడిమాన్పించే ప్రమాదం ఉందన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఎంఈవోకు తెలియ జేస్తామని హెచ్ఎం రాజేంద్రప్రసాద్ తెలిపారు.



- వరండాలోనే విలువైన మందులు, స్టేషనరీ నిల్వ
- చాలీచాలని గదుల్లో విధుల నిర్వహణ
- ఉద్యోగులు కూర్చునేందుకు కుర్చీల కొరత
- ఇదీ.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం తీరు

ఆరోగ్య శాఖ కార్యాలయానికి బాలారిష్టాలు..

హడావుడిగా జిల్లాలు విభజించిన ప్రభుత్వం ఏళ్లు గడుస్తున్నా జిల్లాకు అవసరమైన అన్ని వనరులూ కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనడానికి రాయచోటిలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం అద్దం పడుతోంది. ఏళ్లు గడుస్తున్నా కనీస వసతులు కల్పించకపోవడంతో అందులో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఏర్పాటు దాదాపు మూడేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు వైద్య ఆరోగ్యశాఖలో కూర్చోవడానికి కుర్చీలు, మందులు నిలువ చేసుకునే వసతి లేక సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఏర్పాటు సమయంలో సాయి ఇంజనీరింగ్ కాలేజీలో దాదాపు పది గదులు అద్దెకు తీసుకొని ఏడాది పాటు కాలం నెట్టుకొచ్చారు. వాటికి నెలకు దాదాపు రూ.1.20 లక్షలు అద్దె చెల్లించలేక 2023లో కడప-చిత్తూరు జాతీయ రహదారిలో ఉన్న ఎస్టీ బాయ్స్ హాస్టల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే అక్కడ తగినన్ని గదులు లేకపోవడం ఒకే గదిలో 10 సెక్షన్ల ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇక మందులు, మెటీరియల్ భద్ర పరి చేందుకు వరండా తప్ప మరెక్కడా స్థలం లేదని చెబుతున్నారు. దీంతో మందులతోపాటు, రికార్డులు తదితర స్టేషనరీ అంతా వరండాలోనే నిలువ చేశారు. కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారు. కానీ కొన్ని కార్యాలయాలకు కనీసం వసతులు కూడా లేని పరిస్థితులు ఈ జిల్లాలో నెలకొని ఉండడం చాలా బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రెండు గదులైనా నిర్మించి ఇస్తే కొంత బాగుంటుందని ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది చెబుతున్నారు. ఇక ఈ కార్యాలయంలో తాగటానికి నీరు, బాత్‌రూమ్‌లు, ఇంటర్నెట్ సౌకర్యం కూడా సరిగ్గా లేదని తెలిసింది.


వరండాలో నిల్వ చేసిన మందులు స్టేషనరీ

సిబ్బందికి ఇబ్బందిగానే ఉంది..

కొత్త జిల్లాల్లో కనీస వసతుల కొరత ఉంది. విజయవాడ నుంచి మందులు, మెటీరియల్ వస్తే నిలువ చేయడానికి ప్రత్యేకంగా గది లేదు. కాబట్టి వరండాలో వాటిని నిలువ చేస్తున్నారు. గదులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం అన్న మాట వాస్తవమే. ఈ విషయం ఇదివరకే మేము పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-కొండయ్య, జిల్లా వైద్యాధికారి

టమోటా ధరల పతనంపై విచారణ

- ములకలచెరువులో మార్కెటింగ్ శాఖ అధికారి ఆరా..

ములకలచెరువు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు ఇంత దారుణంగా పడిపోవడానికి కారణమేమిటంటూ గుంటూరు డైరెక్టరేట్ ఆఫ్ మార్కెటింగ్, ఇన్‌స్పెక్షన్ అధికారి కిరణ్ ఆరా తీశారు. ములకలచెరువు మార్కెట్ యార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. ధరల పతనానికి గల కారణాలపై రైతులను విచారించారు. అనంతరం మార్కెట్ కమిటీ అధికారులు, మండీ యజమానులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఇక్కడి నుంచి టమోటాలు ఎగుమతి అవుతున్న కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో దిగుబడి అధికంగా ఉండడంతో టమోటాలు కొనుగోలుకు బయటి రాష్ట్రాల నుంచి వ్యాపారులు రాకపోవడం ఒక కారణమని గుర్తించారు. ఫలితంగా ధరలు పతనమయ్యాయని మండీ యజమానులు వివరించారు. మదనపల్లె, కలికిరి, గుర్రంకొండ, పుంగనూరు టమోటా మార్కెట్లను కూడా ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ బాలాజీ, సిబ్బంది రాజు, రహీం, సునీల్‌లు ఉన్నారు.


రైతులతో మాట్లాడుతున్న గుంటూరు మార్కెటింగ్ శాఖ అధికారి కిరణ్

ప్రభుత్వ న్యాయవాదుల నియామకం

కలికిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాకు సంబంధించి రెండు వేర్వేరు కోర్టుల్లో ఇద్దరు న్యాయవాదులను ప్రభుత్వం నియమించింది. రాయలసీమ జిల్లాలకు సంబంధించి దేవదాయ శాఖ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ నియామకం కూడా చేసింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం మూడు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. కడపకు చెందిన న్యాయవాది బి.శ్రీనివాసులును స్థానిక అదనపు సహాయ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి 52 సెషన్స్ కోర్టు కేసులు పరిష్కారమయ్యేంత వరకు, లేదా తొలగించేంత వరకు , లేదా మూడేళ్ల పదవీ కాలం పూర్తయ్యే వరకు ఏది ముందయితే అంత వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ కాలంలో నెలకు రూ.25 వేలు గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఇక కడప పోక్సో కేసుల స్పెషల్ కోర్టులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కడపకు చెందిన మరో న్యాయవాది కొమ్మినేని వేణుగోపాల్‌ను నియమించారు. మూడేళ్ళ కాల వ్యవధి ముగిసేంత వరకుగానీ లేదా తొలగించే వరకుగానీ ఏది ముందయితే అంత వరకూ ఆయన ఎస్‌పీపీగా కొనసాగనున్నారు. నెలకు రూ.40 గౌరవ వేతనం చెల్లించనున్నారు. కాగా రాయలసీమ జిల్లాలయిన తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం, నంద్యాల జిల్లాలకు సంబంధించి దేవాదాయ శాఖ కేసులను హైకోర్టులో పర్యవేక్షించడానికి స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది తూము వేణుగోపాల్‌ను నియమించారు. హైకోర్టు అడ్వకేట్ జనరల్ ప్రతిపాదనతో ఈయనను కూడా మూడేళ్ళ కాల వ్యవధితో నియమించారు. నెలకు రూ.50 వేలు గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర నాయ, శాసన వ్యవహారాల కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి శుక్రవారం మూడు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

సెలవు రోజునా.. ఆస్తుల రిజిస్ట్రేషన్లు

మదనపల్లె, మార్చి7(ఆంధ్రజ్యోతి): సెలవు రోజులైన శని, ఆదివారం కూడా తమ కార్యాలయం పనిచేస్తుందని స్థానిక సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామి తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ, ఐజీ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రెండో శనివారం, ఆదివారం కూడా పనిచేస్తుందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సౌమ్యనాథాలయ హుండీ కానుకల లెక్కింపు

నందలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సౌమ్యనాథ స్వామి ఆలయ హుండీలో 24 రోజులకుగాను భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. దీంతో 1,94,302 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టీటీడీ విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


హుండీలోని కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

పీలేరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం రేగళ్లు గ్రామ పంచాయతీ నగరి సమీపంలో డి.కృష్ణయ్య(60) అనే వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పొలంలో కృష్ణయ్య మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పీలేరు ఎస్‌ఐ బాలకృష్ణ సంఘటనా స్థలాన్ని సందర్శించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ..

సిద్దవటం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మెకానిక్ షాపు వద్ద నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని మండల కేంద్రంలోని సిద్దవటం బ్రాహ్మణవీధి నివాసి ఉన్న జి.వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం ఉదయం బాకరాపేట గ్రామంలోని అమీర్ మెకానిక్ షాపులో ద్విచక్ర వాహనం పెట్టి నందిమండలం ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో విధులకు వెళ్లానని, సాయంత్రం ఐదు గంటలకు వచ్చే సరికి ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి బైక్ ఆచూకీ గుర్తిస్తామని తెలియజేశారు.

కొండకు నిప్పు.. మామిడితోటలు దగ్ధం

నిమ్మనపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓబులేసుని కొండకు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సమీపంలోని 15 ఎకరాల్లో వివిధ పైరకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతు నరేంద్ర తోటలోని 45 అల్లనేరేడు చెట్లు, మామిడి చెట్లు కాలిపో, రమణకు చెందిన కంచె, నిమ్మనపల్లి రైతు సిలార్‌కు చెందిన మామిడి తోట కాలిపోయినట్లు తెలిపారు.


మంటలు ఆర్పుతున్న రైతు

సుండుపల్లెలో..

సుండుపల్లె: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో 7 ఎకరాల విస్తీర్ణంలోని తమ మామిడి తోట దగ్ధమైందని రైతులు నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో 80కిపైగా పూత దశలో ఉన్న మామిడి చెట్లు కాలిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలిపోయిన మావిడి తోటను మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీకి చెందిన ఎంపీహెచ్‌ఈవో రెడ్డినాయక్ శుక్రవారం పరిశీలించారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్ తగిలి ఓ యువకుడు గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు బి.కొత్తకోట మండలం, బీరంగి గ్రామానికి చెందిన రవి కుమారుడు శ్రీకాంత్ (24) అదే గ్రామంలో శంకరాపురం వద్ద చెట్టు ఎక్కి ఆకులు కోస్తున్న సమయంలో కరెంటు తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు, గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బి.కొత్తకోట పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న యువకుడు

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు కురబలకోట మండలం, తెట్టు గ్రామానికి చెందిన అశోక్ భార్య భార్గవి (20) శుక్రవారం ఉదయం తన భర్త, మామలు తరచూ గొడవ పడుతుండడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న మహిళ

వేడి నీళ్లలో పడి చిన్నారికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేడి నీళ్లలో పడడంతో ఓ చిన్నారి గాయాలపాలైంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు కురబలకోట మండలం, అంగళ్లు పంచాయతీ సర్కార్ తోపునకు చెందిన అక్ష అంజుమ్ (3) శుక్రవారం ఉదయం ఆడుకుంటూ వేడినీళ్లలో పడడంతో శరీరం కాలిపోయింది. తల్లిదండ్రులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చిన్నారి కోలుకుంటోంది.

విధి నిర్వహణలో అలసత్వానికి ఇద్దరు డాక్టర్లపై చర్యలు

- ఒకరి సస్పెన్షన్.. మరొకరికి షోకాజ్ నోటీసులు

పెనగలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్లలో రమ్మీ నిమ్మచి సస్పెన్షన్ కాగా మరో డాక్టర్ థౌషిఫ్‌కు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు డాక్టర్ రమ్మీ నిమ్మచి విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, పలు మార్లు ప్రజల నుంచి అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మరో డాక్టర్ థౌషిఫ్ కూడా విధులకు ఆలస్యంగా రావడంతోపాటు, అప్పుడప్పుడు గైర్హాజరవుతున్నట్లు కూడా తెలియజేయడంతో ఆయనకు కూడా షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఇరువురు డాక్టర్లు పెనగలూరు పీహెచ్‌సీలో తొలిసారిగా ఉద్యోగంలో చేరారు. ఇటీవలనే రెగ్యులర్ అయినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా పెనగలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పటివరకు పనిచేసిన డాక్టర్లలో ఒకరు సస్పెన్షన్ కావడం, మరొకరికి షోకాజ్ నోటీసు ఇవ్వడం ఇదే తొలిసారి. ఈ విషయం వాస్తవమేనని సీహెచ్‌వో సురేంద్రనాథరాజు వివరించారు.

అవినీతి ఆరోపణల నుంచి ఇన్‌స్పెక్టర్ రవిబాబుకు ఊరట

కలికిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గతంలో లక్కిరెడ్డిపల్లె పోలీసు ఇన్‌స్పెక్టరుగా పనిచేసి ప్రస్తుతం అనంతపురం ఇంటెలిజెన్స్‌లో వున్న పి.రవిబాబుకు ప్రభుత్వం నుంచి ఊరట లభించింది. గతంలో ఆయనపై పడిన నిందను తొలగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. లక్కిరెడ్డిపల్లె సీఐగా పనిచేసే కాలంలో రామాపురం పోలీసు స్టేషన్‌లో 2018లో నమోదైన ఒక కేసునుంచి నిందితుడిని తప్పించడానికి మధ్యవర్తితో రూ.27 వేలకు ఒప్పందం కుదుర్చు కున్నాడని, ఆయన సూచన మేరకు ఆ మొత్తాన్ని రామాపురం హెడ్ కానిస్టేబుల్ తీసుకున్నాడని ఆరోపణ. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికెళ్లడంతో విచారణ చేసి రవిబాబును నిందితుడిగా నిర్ధారించారు. ఈ విషయంపై ఆయన అడిషనల్ డైరెక్టర్ జనరల్‌కు అప్పీలు చేసుకోగా 2021 మార్చి 3న తిరస్కరించారు. తాజాగా ప్రభుత్వం ముందు రివిజన్ పిటిషన్ దాఖలు చేయడంతో డీజీపీ.. రవిబాబుకు అనుకూలంగా ప్రభుత్వానికి నివేదించారు. పూర్వాపరాలను పరిశీలించిన ప్రభుత్వం ఎట్టకేలకు ఆయనపై మోపిన 'నింద'ను తొలగించింది.

ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

బ్రెడ్డు తిని ఐదుగురు విద్యార్థులకు అస్వస్థత

తంబళ్లపల్లె,మార్చి 7(ఆంధ్రజ్యోతి): బ్రెడ్డు తినడంతో ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కోటకొండ ఎంపీపీ పాఠశాల ఆరో తరగతి విద్యార్థులు అరవింద్, బన్నీ, అశ్వనీ, సంధ్య, జగదీష్ శుక్రవారం పాఠశాల విశ్రాంత సమయంలో పాఠశాలకు సమీప దుకాణంలో బ్రెడ్డు తెచ్చుకుని తిన్నారు. కొద్ది సేపటికి వాంతులై అస్వస్థతకు గురయ్యారు. గమనించిన ఉపాధ్యాయురాలు లలిత పక్కనే ఆరోగ్య ఉపకేంద్రంలో ఉన్న ఎంఎల్‌హెచ్‌పి దేవిక, ఏఎన్ఎం గంగులమ్మకు చెప్పడంతో వెంటనే వైద్య సిబ్బంది పాఠశాలకు వెళ్లి చికిత్స చేశారు. కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి అనుపమ, మునికుమార్ హుటాహుటిన పాఠశాల చేరుకుని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సమాచారం అందుకున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య, ఎంఈఓ త్యాగరాజు, నాగసుబ్బరాయుడు పాఠశాలకు వెళ్లి విద్యార్థులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి విద్యార్థులంతా పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు మెడికల్ ఆఫీసర్, ఎంఈఓలు తెలిపారు.


విద్యార్థులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య, ఎంఈఓ

డ్వాక్రా గ్రూప్ లీడర్ రూ. 12 లక్షల దుర్వినియోగం

మదనపల్లె అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపునకు చెందిన నగదును గ్రూపు లీడర్ స్వాహా చేసిందంటూ ఆ గ్రూపు సభ్యు లు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఈశ్వరమ్మ కాలనీకి చెందిన రాజరాజేశ్వరి గ్రూప్‌లో 10 మంది సభ్యులు ఉండ గా లీడర్‌గా కె. రాధా వ్యవరించేది. గ్రూపు సభ్యులు పొదుపు చేసుకున్న నగదు, మరో గ్రూప్ సభ్యురాలు లక్ష్మీదేవికి చెందిన రూ. 1.2 లక్షలతో సహా రూ. 12 లక్షలతో ఉడాయించింది. దీనికి సంఘమిత్ర వాణి పూర్తి సహకారం అందించిందంటూ ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి కేసు నమోదు చేస్తామని తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. గ్రూప్ సభ్యులు పద్మ, రెడ్డిరాణి, ని ర్మల, చంద్రకళ, లలిత, లక్ష్మీదేవి ు పాల్గొన్నారు.


గ్రూప్ లీడర్‌పై ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

క్యూఆర్ కోడ్ స్కాన్‌తో విద్యుత్ బిల్లుల చెల్లింపు

- ప్రత్యేక యాప్ రూపకల్పన
- వినియోగదారులకు వెసులుబాటు

కురబలకోట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలనే ఆశయంతో ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. సాధారణంగా విద్యుత్ బిల్లులను చెల్లించడానికి వినియోగదారులు చాలా శ్రమించాల్సి ఉంటుంది. గ్రామీణ, పట్టణ,నగర ప్రాంతాల్లో బిల్లుల చెల్లింపు కేంద్రాల వద్ద వినియోగదారులు రద్దీ ఎక్కువగా ఉండడంతో గంటల కొద్దీ క్యూలైన్ లో నిలబడాల్సివచ్చేది.. నిలుచునే ఓపిక లేకపోవడం, ఇతర పనులు ఉండడం, తదితర కారణాలతో మరోసారి చెల్లించవచ్చని అధికశాతం మంది వెళ్ళిపోతుంటారు. తర్వాత ఆ విషయాన్ని మర్చిపోవడంతో సకాలంలో(14రోజుల లోపు) విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోతున్నారు. దీంతో అదనంగా జరిమానాలు భరించాల్సి వచ్చేది. ఈ జరిమానాలు కేటగిరి-2 కు రూ.150, కేటగిరి-1కు వినియోగదారుడికి వచ్చే బిల్లును బట్టి రూ.25 నుంచి రూ.50 వరకు చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుత పద్ధతిలో చేతిలో సొమ్మున్నా సమయానికి బిల్లులు చెల్లించ లేని వినియోగదారులకు విముక్తి లభించింది. గతంలో ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించే వెసులుబాటు ఉండేది. అయితే వాటిలో పలురకాల సమస్యలు తలెత్తడంతో ఆ పద్ధతికి ప్రభుత్వం స్వస్తి పలికింది. తాజాగా క్యూఆర్ కోడ్ స్కాన్ పద్ధతిని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా సులభంగా ఎక్కడి నుంచైనా బిల్లులను చెల్లించవచ్చును. అయితే విద్యుత్ బకాయిలు ఉన్న వారికి ఇది పని చేయదు. దీంతో వాళ్ళు కార్యాలయానికి వెళ్ళి బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది.



క్యూఆర్ కోడ్‌తో వచ్చిన విద్యుత్ బిల్లు

50శాతం రాయితీతో అదనపు లోడు

వినియోగదారుల సౌకర్యార్థం 50 శాతం రాయితీతో అదనపులోడు పొందే అవకాశాన్ని విద్యుత్ సంస్థ కల్పించింది. సాధారణంగా గృహవినియోగానికి మినిమం వాటేజీకి ఇంటి యజమాని సొమ్ము చెల్లించి ఉంటాడు. ఈ వాటేజీతో ఏసీ, కూలర్, ఫ్రిడ్జ్, హీటర్, గీజర్‌లను వినియోగించడం కదరదు. ఒక వేళ వినియోగిస్తే పరికరాలు కాలిపోయే ప్రమాదం ఉంది. దీంతో వినియోగదారుడికి తీవ్ర నష్టం కలుగుతుంది. అదనపు వాట్స్ పొందితే ఆ సమస్యలను నివారించవచ్చును. ఇందుకోసం గతంలో చెల్లించాల్సిన మొత్తంలో సగం రాయితీ ఇస్తోంది. ఈ మొత్తంతో పాటు అప్లికేషన్ ఫీజు రూ.50, డిపాజిట్ రూ.200చెల్లించాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ శంకర్ రెడ్డి తెలిపారు

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి సురేశ్

రాయచోటిటౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి సురేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సురేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న బీసీ, ఈబీసీ కేటగిరీలకు చెందిన టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 10 నుంచి ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ కు సొంత జిల్లాలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారు రాయచోటిలోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం లో దరఖాస్తులు పొంది అక్కడే సమర్పించాలన్నారు. ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభ తేదీ తదితర వివరాలు త్వరలో రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అధికారులు తెలియజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు రాజంపేట రోడ్డులోని గిరిజన పాఠశాల వెనుక ఉన్న బీసీ సంక్షేమశాఖ కార్యాలయం లో సంప్రదించాలని తెలిపారు.

నందలూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్

నందలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే స్టేషన్‌లో హరిప్రియ, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌ను పునరుద్ధరించారు. కొల్హాపూర్ నుంచి తిరుపతికి వెళ్లే 17416, తిరుపతి నుంచి కొల్హాపూర్‌కు వెళ్లే 17415 హరిప్రియ ఎక్స్‌ప్రెస్, కడప నుంచి విశాఖపట్టణం వెళ్లే 18521, విశాఖపట్టణం నుంచి కడపకు వచ్చే 18522 తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నందలూరులో స్టాపింగ్ రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈనెల 8 నుంచి ఆ రైళ్లను నందలూరులో నిలిపేందుకు రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మండలంలోని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పంట పొలాలకు నెమళ్ల బెడద


పొలాల్లోకి గుంపులు గుంపులుగా వస్తున్న నెమళ్లు

చిన్నమండెం, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లి గ్రామ పంచాయతీలో రైతులకు నెమళ్ల బెడద ఎక్కువైందని రైతులు వాపోతున్నారు. పదుల సంఖ్యలో నెమళ్లు గుంపులుగా పొలాలపై పడి వేరుశనగ, వరి, అలసంద వంటి పైర్లను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రయితే అడవి పందులు, పగలైతే నెమళ్లతో రాత్రింబవళ్లు రైతులు పంటల దగ్గర కావలి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు

ఇద్దరిపై లైంగిక దాడి కేసు నమోదు

నిమ్మనపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లంవారిపల్లెకు చెందిన ఇద్దరిపై రేప్ కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన ఓ మహిళ గత నెల 27న సాయంత్రం నల్లంవారిపల్లికి వచ్చి పాలు పోసి వెళుతుంగా అదే గ్రామానికి చెందిన సురేంద్ర, పల్లపు నాగేంద్ర ఆమెను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. భర్త సాయంతో ఆమె తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితులను అరెస్ట్ చేసి వారిపై లైంగికదాడి కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మదనపల్లె అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): స్థలం, డబ్బు విషయమై ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడ్డారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన సమాచారం మేరకు స్థానిక శేషమహల్ ప్రాంతానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి స్థలం విక్రయిస్తానంటూ జాషువా నుంచి మూడు లక్షల రూపాయలు తీసుకున్నాడు. ఏడాది గడిచినా స్థలం ఇవ్వకపోగా, డబ్బు కూడా వాపసు చేయలేదు. దీంతో గురువారం రాత్రి జాషువా తన కుమారులతో కలిసి వెళ్లి వెంకటరమణను ప్రశ్నించాడు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో జాషువా, అతని కొడుకులు భరత్, జోసెఫ్, మహేష్ గాయపడ్డారు.కుటుంబ సభ్యులు వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ భూములు పరాధీనం

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఆక్రమణదారులకు సిబ్బంది సహకారం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులాల అభివృద్ధి కోసం ప్రభుత్వం వివిధ పథకాలను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తోంది. ఇందులో స్వయం ఉపాధి కల్పన కోసం రుణాలు ఇవ్వడంతో పాటు భూమిలేని నిరుపేద ఎస్సీ మహిళలకు భూమి కొనుగోలు పథకం కింద వ్యవసాయ భూములను పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా వ్యాపార రంగంలో కూడా ఎస్సీలను ఆర్థికంగా నిలబెట్టేందుకు పలుచోట్ల షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. వీటిలో ఒక్క వేంపల్లెలో మినహాయిస్తే ఉమ్మడి కడప జిల్లా లోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లు దెబ్బతిన్నాయి. వాటిని పునర్నిర్మించే పనులు చేపట్టకపోవడంతో కొన్నిచోట్ల నేలమట్టం అయినట్లు ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు చెబుతున్నారు. వీటిని పరిరక్షించేందుకు అధికారులు తగిన చొరవ చూపకపోవడంతో అన్యాక్రాంతమవుతున్నాయి. ఎస్సీలలో ఆర్థిక సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కొన్ని దశాబ్దాల క్రితం వ్యాపార సముదాయాల నిర్మాణాలు చేపట్టి వాటి ద్వారా ఎస్సీ యువతకు ఉపాధి కల్పించడం జరిగేది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా తగిన రీతిలో నిధుల కేటాయింపు లేకపోవడంతో జిల్లాలో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

వందలకోట్ల ఆస్తి పరాధీనం

ఎస్సీ సామాజిక వర్గాల్లోని వారికి కోళ్లపెంపకం ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు ఉమ్మడి కడప జిల్లాలో 81.80 ఎకరాల్లో 155 పౌల్ట్రీ కాంప్లెక్స్‌లను 1984-85 ఆర్థిక సంవత్సరంలో నిర్మించారు. ఇవన్నీ కూడా కూలిపోయినట్లు ఎస్సీ కార్పొరేషన్ అధికారయంత్రాంగం చెబుతోంది. దీంతో ఎస్సీ కార్పొరేషన్‌కి సంబంధించిన పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల స్థలాలను ఎస్సీలే కాకుండా ఇతర సామాజిక వర్గాల వారు కూడా ఆక్రమించుకొని అనుభవించుకుంటున్నారు. దెబ్బతిన్న పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల స్థానంలో కొంతమంది రెవెన్యూ వారి ద్వారా రికార్డులు కూడా తమ పేర్లతో పొందినట్లు తెలుస్తోంది.

- రాజంపేట మండలం తాళ్లపాక వద్ద 1984-85 ఆర్థిక సంవత్సరంలో సర్వేనెంబర్ 1162లో 6.72 ఎకరాల్లో 30 షాపుల కెపాసిటీతో ఎస్సీ కార్పొరేషన్ పౌల్ట్రీ కాంప్లెక్స్‌ను నిర్మించింది. ప్రస్తుతం ఆ కాంప్లెక్స్ కుప్పకూలిపోయింది. దీంతో ఇతరులు (ఎస్సీలు కానివారు) తమ పేర్లతో రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించుకున్నట్లు సమాచారం. ఈ స్థలం కడప-తిరుపతి ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో మంచి ధర పలుకుతోంది. ఇక్కడ సెంటు భూమి రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ లెక్కన దాదాపు రూ.80కోట్లు విలువైన స్థలం పరులపాలైనట్లు చర్చ సాగుతోంది.
- పులివెందుల పట్టణంలో 1984-85లో సర్వే నెంబర్ 60-2, 61-2, 62-1లో 12.6 ఎకరాల విస్తీర్ణంలో 22పౌల్ట్రీకాంప్లెక్స్‌లకు నిర్మాణం చేపట్టారు. అది కూడా కూలిపోవడంతో స్థానికంగా ఉన్న ఓ నేత తమ స్థలంలో కలిపేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు సర్వే నిర్వహించి ఆ స్థలం ఎస్సీ కార్పొరేషన్‌కి వస్తుందంటే.. తాను వదిలేందుకు సిద్ధంగా ఉన్నానని ఆ నేత కుటుంబీకులు చెప్పినప్పటికీ సమగ్రంగా సర్వే నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా లేరని సమాచారం.
- చిట్వేలి మండలంలోని గొల్లపల్లెలో సర్వే నెంబర్ 1387-4లో 11.9 ఎకరాల్లో 24, వెంకట్‌రాజుపల్లె సర్వేనెంబర్ 848-బి1, బి-2లలో 9.41ఎకరాల స్థలంలో 19, మల్లంపల్లెలో 146-2లో 9.64ఎకరాలలో 20, లక్కిరెడ్డిపల్లె మండలంలోని బూడిగుంటపల్లెలో సర్వేనెంబర్ 135-3లో 13.52ఎకరాలలో 34, టి.సుండుపల్లె మండలంలోని జీకె రాచపల్లెలో 9, 51, 968లలో 10.29ఎకరాలలో 20, కొండాపురంలో 7.92 ఎకరాలలో 16 పౌల్ట్రీ కాంప్లెక్స్‌లు నిర్మించారు. అయితే అవన్నీ కూలిపోయినట్లు అధికార యంత్రాంగం చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో దాదాపు వీటిల్లో అధిక భాగం ఆక్రమణలకు గురైనట్లు సమాచారం. వేంపల్లెలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ మాత్రం లబ్ధిదారులు వినియోగించుకుంటున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా...

రాష్ట్రంలోని ఏ జిల్లాలో లేని విధంగా.. ఒక్క కడప జిల్లాలో మాత్ర మే జిల్లా హరిజన డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు భూమి ఉండేది. 1974లో ఎస్సీ కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత ఆ భూమిపై హక్కులు పొందినట్లు సమాచారం. ఈమేరకు ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించిన 3505 ఎకరాల భూమిని కొన్ని దశాబ్దాల క్రితం 1916 మందికి పంపిణీ చేశారు. అయితే ఏక్‌సాల్ పర్మిషన్ మాత్రమే ఇవ్వడం వల్ల ఆ భూములు ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోనే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం ఎస్సీలు కాకుండా ఇతర సామాజిక వర్గాల వారు ఈ భూములను అనుభవిస్తున్న పరిస్థితి. దురాక్రమణలో ఉన్న ఈ


చిట్వేలి మండలం గొల్లపల్లె వద్ద శిథిలావస్థకు చేరుకున్న పౌల్ట్రీ కాంప్లెక్స్

భూములను తిరిగి ఎస్సీ కార్పొరేషన్ స్వాధీనం చేసుకొని అర్హులైన దళితులకు పంపిణీ చేయాలని అధికారులకు వినతులు అందాయి.

ఆక్రమణదారులకు సిబ్బంది సహకారం

ఎస్సీ కార్పొరేషన్‌లో గతంలో పనిచేసిన కొంతమంది సిబ్బంది ఆ కార్పొరేషన్‌కు సంబంధించిన విలువైన స్థలాల సమాచారాన్ని అందజేసి సొమ్ము చేసుకున్నట్లు చర్చ సాగుతోంది. అంతేకాకుండా చాలా వరకు రికార్డులు కూడా అందుబాటులో లేకపోవడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటే ఆలోచన చేయాల్సిన పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో దృష్టి సారిస్తే రికార్డులను తిరిగి పొందే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయమై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అవినీతి అధికారులపై కలెక్టర్ కొరడా

- తాజాగా మరో ఇద్దరిపై వేటు
- పంచాయతీ సెక్రటరీ పుల్లారెడ్డి సస్పెన్షన్
- కంప్యూటర్ అపరేటర్ హనీఫ్ బాష సర్వీస్ నుంచి తొలగింపు

కడప రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ అవినీతి అధికారులపై జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కొరడా ఝుళిపిస్తున్నారు. ఇప్పటికే వేంపల్లె, ఒంటిమిట్ట, తొండూరు మండలాల్లో గ్రామ పంచాయతీ, మండల పరిషత్ నిధుల దుర్వినియోగానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యులైన ఎంపీడీవో, ఏవో, ఈవోపీఆర్డీ, కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ సెక్రటరీలతో సహా 7 మందికి పైగా సస్పెండ్ చేశారు. తాజాగా రాజుపాళెం మండలం ఏరువపాలెం గ్రామ పంచాయతీ గ్రేడ్- 3 సెక్రటరీ(ప్రస్తుతం డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్) బి.పుల్లారెడ్డిని సెస్పెండ్ చేశారు.

అలాగే చాపాడు మండలం కంప్యూటర్ ఆపరేటర్ షేక్ హనీఫ్ బాషను విధుల నుంచి తొలగించారు. పుల్లారెడ్డి వైసీపీ ప్రభుత్వంలో ఏరువపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీగా ఉన్న సమయంలో గ్రామ పంచాయతీ నిధులలోని రూ.4,25,986ల ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో సదరు నివేదికను ఈ-ఆఫీస్ ద్వారా కలెక్టర్‌కు పంపగా... సీసీఏ రూల్స్ 1991లోని రూల్ 8 కింద సర్వీస్ నుంచి సస్పెండ్ చేశారు. అలాగే చాపాడు మండలంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న షేక్ హనీఫ్ బాష బద్రిపల్లి గ్రామ పంచాయతీ నిధులలో రూ.2,56,325లు మేర ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డా రు. దీంతో కలెక్టర్ అతన్ని సర్వీస్ నుంచి తొలగించి క్రిమినల్ చర్యలకు ఆదేశించారు.

పుస్తకాల భారం తగ్గించేలా నిర్ణయం తీసుకోడం హర్షణీయం

కడప ఎడ్యుకేషన్,మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పుస్తకాల భారం తగ్గించేలా సెమిస్టర్‌ల వారీగా పుస్తకాలు బైండింగ్ చేసి ఇస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. విద్యార్థులకు పుస్తకాల భరాం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని.. ఈ భారాన్ని తగ్గించాలంటూ తాము ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుస్తకా లను సెమిస్టర్ల వారీగా బైండింగ్ చేయించి పంపిణీ చేయించడంతో పాటు నాణ్యమైన విద్యాకానుక కిట్లను అందిస్తామని ప్రకటించడం స్వాగతించదగ్గ విషయమన్నారు. వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని పదివేల పాఠశాలల్లో అమలు చేస్తున్నట్లు మంత్రి చెప్పారని, అయితే ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి తగ్గిస్తే ఇది సఫలీకృతం అవుతుందన్నారు.

12న వైవీయూ వ్యవస్థాపక కళాశాల దినోత్సవం

కడప ఎడ్యుకేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం వ్యవస్థాపక కళాశాల దినోత్సవం ఈనెల 12వ తేదీ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి వెల్లడించారు. నిర్వహణ ఏర్పాట్లు, పీజీ 2,4 సెమిస్టర్ల పరీక్షల తేదీల నిర్ణయం, సిలబస్ తదితర విషయాలపై ఆయా విభాగాధిపతులతో శుక్రవారం భేటీ అయ్యారు.

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు


అరెస్టు చేసిన నిందితుడిని చూపుతున్న సీఐ, ఎస్ఐలు

పెండ్లిమర్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగనపల్లె గ్రామంలో ఈనెల 2వ తేదీ నాగులుగారి లూర్ధు మేరి (50) అనే మహిళ హత్యకు గురైం ది. మృతురాలి కూతురు నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధు సూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని మేరీని ఆమె భర్త సుబ్బరాయుడు తలను గోడకు కొట్టడంతో మృతి చెందినట్లు విచారణలో తేలింది. నిందితుడు రెవెన్యూ అధికారుల ద్వారా పోలీసుస్టేషన్‌కు వచ్చి తన నేరాన్ని అంగీకరించ డంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పెట్టినట్లు సీఐ చల్లని దొర, ఎస్ఐ మధుసూదన్ రెడ్డిలు తెలిపారు.

అంగన్వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం

- సీడీపీవో వేధింపులే కారణమంటూ వివరణ

కాశినాయన మార్చి 7 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కోడిగుడ్లపాడు అంగన్వాడీ టీచర్ గురుదేవి శక్రవారం విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను పోరుమామిళ్ల ప్రభుత్వ వైద్య శాలకు తరలించి చికిత్స అందించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. పోరుమామిళ్ల ఐసీడీఎస్ సీడీపీవో వేధింపులే తన ఆత్మహత్యాయత్నానికి కారణమని బాధితురాలు గురుదేవి మీడియా ఎదుట వాపోయారు.

వేధింపులకు పాల్పడలేదు.. సీడీపీఓ

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తాను లంచం డిమాండ్ చేసి వేధింపులకు పాల్పడటం వల్లనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు అంగన్వాడీ కార్యకర్త చేస్తున్న ఆరోపణలు సరికాదని పోరుమామిళ్ల సీడీపీఓ లక్ష్మీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడీ సెంటర్ కోడ్ మార్పు విషయంలో కార్యకర్త తనను సంప్రదించారని.. ఆ కోడ్ మార్చే అంశం తన పరిధిలోకి రాదని చెప్పానన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పినప్పటికీ కార్యకర్తతో పాటు ఆమె కుమార్తె బెదరింపులకు పాల్పడ్డారన్నారు. తన తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుందని ముందుగానే హెచ్చరించినట్లు ఆమె వివరించారు. ఇదే అంశాన్ని ఒక రోజు ముందుగానే పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లానని తెలిపారు.

వన్యప్రాణిని వేటాడిన వ్యక్తికి రిమాండ్

వేంపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఫారెస్టు బీట్ కప్పలమడుగు వద్ద కొండ గొర్రె (వన్యప్రాణి)ను వేటాడిన చింతకాయల శ్రీరాములును అరెస్టు చేసి పులివెందుల కోర్టులో హాజరుపర్చినట్లు రేంజర్ బాలసుబ్రమణ్యం తెలిపారు. వేటా డేందుకు వెళ్లారని సమాచారం అందడంతో దాడి చేసి శ్రీరాము లును అదుపులోకి తీసుకొని నాటుతుపాకీని, 4 కేజీల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గంజాయి అక్రమ రవాణా కట్టడికి చర్యలు


ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న సీఐలు యుగంధర్, రమణారెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో గంజాయి అక్రమ రవాణా కట్టడి చేసేందుకు పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో బాగంగా శుక్రవారం స్థానిక టూటౌన్ ఏరియాలో ఉన్న ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలను గౌడౌన్‌లను డిస్ట్రిక్ నార్కోటిక్ కంట్రోల్ సెల్ (డీఎన్‌సీసీ) టూటౌన్ పోలీసులు సంయుక్తంగా తనిఖీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు ట్రాన్స్‌పోర్టులలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడినా, సహకరించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ యుగంధర్, డీఎన్‌సీసీ సీఐ రమణారెడ్డిలు ట్రాన్స్‌పోర్టు యజమానులను హెచ్చరించారు. పార్శిళ్లలో ఎక్కడైనా గంజాయి ఆనవాళ్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మల్లికార్జునరెడ్డి మృతదేహం

దువ్వూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు, క్రీస్తురాజపురం మార్గమధ్యంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తుమ్మల మల్లికార్జునరెడ్డి (39) అనే వ్యక్తి మృతి చెందాడు. దువ్వూరు నుంచి తన సొంత గ్రామం గుడిపాడుకు బైక్‌పై వెళుతూ అదుపు తప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

ఎస్ఎస్‌సీ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్

- ఈవిద్యాసంవత్సరం నుంచి ప్రారంభం
- మార్చి 20, 25న పరీక్షలు

వల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షలంటే ప్రతి విద్యార్థికి భయం ఉంటుంది. కొంత మంది విద్యార్థులకు ఎక్కువసార్లు డ్రిల్లింగ్ చేయడం వల్ల మాత్రమే గుర్తుండే అవకాశం ఉంటుంది. మరి కొంతమంది విద్యార్థులు నేర్చుకునే విషయాన్ని పరీక్ష రూపంలో చూపించడంలో అనేక సమస్యలు ఎదుర్కొంటారు. ఇంకొందరు విద్యార్థులు ఎక్కువగా వీక్‌గా ఉన్న సబ్జెక్టుల్లో ప్రీఫైనల్, గ్రాండ్ టెస్టువంటి పరీక్షలు సాధన చేయడం ద్వారా మంచిమార్కులు సాధించేందుకు ఇదొక చక్కటి అవకాశం. పరీక్షలపై విద్యార్థులకు ఉన్న అనేక అపోహలను పోగొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ విద్యార్థులకు గ్రాండ్ టెస్టు నిర్వహిస్తుంది. జిల్లాలో 27,800 మంది విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం పరీక్షలు రాయనున్నారు. మార్చి 17 నుంచి 31 వరకు ఎస్ఎస్‌సీ పరీక్షలను నిర్వహిస్తారు.

రీసైక్లింగ్ పునశ్చరణ : డీఈవో

విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్న సందర్భంగా పదే పదే ప్రాక్టీసు పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో పున శ్చరణ పెరిగి రీసైక్లింగ్ అలవాటు పడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఈ గ్రాండ్ టెస్టు వల్ల పరీక్షల సమయంలో సమయాన్ని ఎలా ఉపయోగించు కోవాలో తెలుస్తుందన్నారు. ఏ ప్రశ్నకు ఏ జవాబు రాయాలనేది విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందన్నారు. పరీక్షలు రాసేటప్పుడు భయం తొలుగు తుందన్నారు. దీంతో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరగడంతో పాటు మార్కులు అత్యధికంగా తెచ్చుకునేందుకు ప్రీఫైనల్, గ్రాండ్ టెస్టు వంటి పరీక్షలు ఎంతో ఉపయోగపడుతాయి.

గుండె పోటుతో ఉపాధి కూలి మృతి



వల్లూరు మార్చి 7, (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని అంబవరం గ్రామంలో శుక్రవారం ఉపాధి పనిచేస్తున్న మహిళా కూలీ చెంచుగారి పుల్లమ్మ గుండెపోటుతో మృతి చెందినట్లు ఏపీఓ సుధా రాణి తెలిపారు. ఉదయం ఉపాధి పనికి వెళ్లిన పుల్లమ్మ గుండెల్లో నొప్పి వస్తుందని చెప్పడంతో ఆమె బంధువులు ఇంటివద్దకు తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని ఏపీఓతో పాటు ఉపాధి సిబ్బంది సంద ర్శించి నివాళి అర్పించారు.

చాపకింద నీరులా...

- జోరుగా సాగుతున్న మట్కా దందా
- టెక్నాలజీని వాడుకుంటున్న బీటర్లు
- పోలీసులకు సవాల్‌గా మారిన వ్యవహారం

కడప క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రూ.వంద కడితే వెయ్యి రూపాయలు వస్తుందనే ఆశతో కొందరు... వెయ్యి కడితే లక్షల్లో వస్తుందంటూ మరికొందరు అత్యాశతో మట్కా ఊబిలో చిక్కుకొని జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ఈ మట్కాలో పోయేదే కానీ వచ్చేది లేదనేది తెలియకపోవడంతో ఎక్కు వగా ఈ దందాలో పేద, మధ్యతర గతి వారే బలవుతున్నారు. వివరాల్లోకి వెళితే...

జిల్లా వ్యాప్తంగా మట్కా జూదం రోజురోజుకూ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఈ మట్కా ఊబిలో పేద మధ్య తరగతి వారితో పాటు యువత, చిరుద్యోగులు చిక్కుకుపోతున్నా రు. ఇక ఎక్కువగా కూలీ నాలీ పనులు చేసుకునే వారు రోజంతా సంపాదించిన డబ్బులు మట్కా జూదంలో పోగొట్టుకుంటున్నారు.

జిల్లాలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు, బద్వేలు, కమలాపురం నియోజకవర్గాల్లో మట్కా జోరుగా సాగుతున్నట్లు సమాచారం.


టెక్నాలజీని వాడుకుంటున్న బీటర్లు

ఒకప్పుడు మట్కా బీటర్లు ఎక్కడో ఒక ప్రదేశంలో ఉంటూ చిన్న చిన్న చీటీల ద్వారా ఈ జూదాన్ని నిర్వహించే వారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరు స్మార్ట్ ఫోను వినియో గిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన మట్కా బీటర్లు టెక్నాలజీని ఉపయోగిస్తూ గుట్టుచప్పుడు కాకుండా ఈ దందా నడుపుతున్నారు. దీంతో మట్కా నిర్వాహకులను పట్టుకోవాలంటే పోలీసులకు సవాల్‌గా మారింది. ఇక మట్కా బీటర్లు మట్కా వేసే వారికి ఇన్ స్ట్రాగ్రామ్‌లో ఐడీలు పెట్టి అందులో మట్కా నెంబర్లు సేకరిస్తున్నారు. ఎవరైనా పట్టుబడితే తెలివిగా ఇన్‌స్టా గ్రామ్‌లోని ఐడీని తొలగిస్తున్నారు. దీంతో వీరిని గుర్తించడం సాధ్యపడటం లేదు.

కొరవడిన నిఘా

మట్కాదందాను నిర్మూలించడంలో పోలీసులు విఫలమవుతున్నారు. మట్కా బీటర్లు టెక్నాలజీని వాడుకోవడం, కొత్తకొత్త వ్యక్తులు మట్కా బీటర్లుగా అవతార మెత్తుతుండటంతో వీరిని గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. గతంలో మట్కా అంటే ఫలానా వ్యక్తులని గుర్తింపు ఉండడంతో వారిపై నిఘాఉంచి పట్టుకునేవారు. అయితే ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ల ద్వారా ఈ దందా నడుపుతుండడంతో పోలీసు నిఘా కొరవడినట్లు స్పష్టమవుతుంది. కాగా, కొన్ని చోట్ల బహి రంగంగానే దుకాణాల్లో మట్కా స్లిప్పులు రాస్తు న్నట్లు తెలుస్తుంది.

బతికుండగానే డెత్ సర్టిఫికెట్ సృష్టించి..

- స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు
- పోలీసులకు బాధిత మహిళ ఫిర్యాదు

మైదుకూరు రూరల్, మార్చి7 (ఆంధ్ర జ్యోతి): బతికుండగానే చనిపోయినట్లు దొంగసర్టిఫికెట్ సృష్టించి తన స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారంటూ మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు.. మైదుకూరు-నంద్యాల రోడ్డులో 1149, 1158 సర్వే నెంబర్లలో 10సెంట్ల స్థలాన్ని కడపకు చెందిన అహల్య, ఆమె కుమార్తె అమరావతి 1998 సంవత్సరంలో యెలిశెట్టి పిచ్చమ్మ, ఆమె కుమార్తెలు ఉషారాణి, సుబ్బరత్నమ్మ, గీతాకుమారిల వద్ద కొనుగోలు చేశారు. కాగా, అదే స్థలాన్ని యెలిశెట్టి పిచ్చమ్మ వారి కుమార్తెలు 2011లో చింతకుంట షబ్బీర్ హుసేన్‌కు అమ్మారు. అహల్యా, అమరావతిల మధ్య మనస్పర్థలు ఉన్నాయని తెలుసుకున్న షబ్బీర్‌హుసేన్ అమరావతితో ఒప్పందం కుదుర్చుకొని అహల్య చనిపోయినట్లు డెత్ సరిఫికెట్ సృష్టించి, షబ్బీర్ హుసేన్ భార్య రహమ్మతున్నీషా పేరున 2022లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయాన్ని ఆన్‌లైన్‌లో చెక్ చేసి అహల్య మైదుకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పశుగ్రాసం - రైతులకు భారం



కానరాని పచ్చిక - పశుపోషణ గగనం
కుదేలవుతున్న పాడి రైతు

కలకడ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎండ తీవ్రత కారణంగా మూగజీవాలకు పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీంతో పాడి రైతు పశువులను మేపేందుకు గ్రాసం కొరతతో కుదేలవుతున్నాడు. వివరాల్లోకెళితే....

జిల్లాలోని కరువు మండలాల్లో ఒకటైన కలకడ ప్రాంతంలో నీటి వనరులు అరుదు. ఈ పరిస్థితిల్లో సాగుపై ఆశ వదిలి ఎక్కువ భాగం ప్రజలు పాడి పరిశ్రమను ఎంచుకుని జీవనం సాగిస్తున్నారు. పాడి ఆవులు, గొర్రెలు, మేకలు, పొట్టేలు తదితర జీవాలు మేపుతూ జీవిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎక్కువ భాగం టమోటా సాగు చేస్తారు. తక్కువ విస్తీర్ణంలో పశుగ్రాసానికి విని యోగించే వేరుశనగ, వరి సాగైంది. సకాలంలో వర్షాలు కురవక వేరుశనగ, వరి పంటలు దెబ్బ తిని ఆశించిన స్థాయిలో పశుగ్రాసం దక్కలేదు. ప్రత్యా మ్నాయంగా ప్రభుత్వం ఉలవ సాగును ప్రోత్సహించినా ఆ పంట ఫలితం ఇవ్వలేదు. ఐదేళ్ల గణాంకాల ప్రకారం మండలంలో తొమ్మిది వేల పాడి ఆవులు, సుమారు 74 వేల దాకా పొట్టేలు, మేకలు, గొర్రెలు ఉంటాయని అంచనా. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో పుడమిపై పచ్చిక కానరాక పాడి రైతులు అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వేసవిలో పాల ఉత్పత్తి తగ్గి ఆదాయం కుచించుకుపోగా పశుగ్రాసం కొనుగోలుకు చేతిలో సొమ్ములేక ఆర్థికంగా కుదేలవుతున్నామని వాపోతున్నారు. ఈ ఆదాయంతోనే పిల్లల చదువు, కుటుంబ జీవనం లాక్కొస్తున్నట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితిలో ప్రభుత్వం పశుగ్రాసం, దాణాను రాయితీతో అందించి ఆదుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

పరిస్థితులు గగనంగా మారాయి



గొర్రెల పెంపకంపై ఆధాపడి జీవిస్తున్నాం. మాకు 90 గొర్రెలున్నాయి. ఎండాకాలంలో వాటి పో షణ కష్టంగా మారింది. నీరు, మేత కనుచూపు మేరలో కంటపడడం లేదు. వామిలో నిల్వ ఉంచుకున్న పాత శనగపొట్టుతో ప్రస్తుతం కాలం వెల్లదీస్తున్నాం. పరిస్థితులు గగనంగా మారాయి. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

హర్షవర్ధన్, గొర్రెల పెంపకందారుడు, పాపిరెడ్డిగారిపల్లె, కలకడ మండలం

పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించాం

మండల కరువు పరిస్థితులను ప్రభుత్వానికి నివేదించాం. పాడి రైతులకు అవసరమైన గడ్డివిత్తనాలు, దాణ తదితరాలపై ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అందగానే పాడి రైతులకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

కృష్ణయ్య, ఏడీ, పశుసంవర్ధశాఖ, కలకడ



చెట్ల ఆకులను తింటున్న మేకలు, గొర్రెలు

కోర్టులో గంగమ్మకు ప్రత్యేక పూజలు



మదనపల్లె అర్బన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డు, కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు శుక్రవారం ఆలయకమిటీ సభ్యులు విశేషంగా అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో ఆలయం చేరుకుని పసుపు, కుంకుమ, చీర, జాకెట్లతో పొంగళ్లు నైవేద్యం సమర్పించారు. రాహుకాల సమయంలో నిమ్మకాయలపై నెయ్యి వత్తులతో దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రాకొండ రంగస్వామి నాయుడు, కరుణాకర్ నాయుడు, దేవేంద్ర, మార్పూరి విక్కీ, మార్పూరి మహేష్, శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించండి

కురబలకోట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, ఏఓ రాధ పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రపల్లె, బలకవారిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తుందిలో ఆయన మాట్లాడుతూ వేరుశనగ కె6కు బదులు 1694ను సాగు చేస్తే పంట మంచి దిగుబడిని సాధించవచ్చన్నారు. పంటల సాగుకు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి సాగు చేయాలన్నారు. వ్యవసాయాధికారి రాధ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ తీరుపై నిరసన

రామసముద్రం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అర్జీలు ఇవ్వడానికి వస్తే తహసీల్దార్ నిర్మలాదేవి దురుసుగా ప్రవర్తిస్తున్నారని బాధితులు నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇవ్వడానికి వస్తే తహసీల్దార్ అమర్యాదగా మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులనే గౌరవం లేకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నారని సర్పంచి వెంకటరమణ, మాజీ సర్పంచ్ చలపతినాయుడు ఆరోపించారు. కమ్మవారిపల్లె రైతు లక్ష్మన్న గడ్డివామి గురువారం రాత్రి అగ్ని ప్రమాదానికి గురవడంతో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళితే 'అనుమతి లేకుండా లోపలికి ఎలా వస్తారు, నేను మండల మెజిస్ట్రేట్‌ను' అని దురుసుగా ప్రవర్తించిందన్నారు.

గో సంరక్షణ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

మదనపల్లె అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా గో సంరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అష్రఫ్‌ను జనసేన, బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్ నేతలు, స్నేహితులు, మిట్స్ కళాశాల విద్యార్థులు సన్మానించారు. అతను చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం డాక్టరేట్ ప్రదానం చేసినందుకు శుక్రవారం మదనపల్లెలో ఘనంగా సత్కరించారు. జనసేన పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ దారం అనిత, హరిప్రసాద్, టీడీపీ, కాంగ్రెస్ నేతలు రఘుపతినాయుడు, వేమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మురికి కాల్వ పూడ్చేశారు

రామసముద్రం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పెద్ద కురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె బీసీ కాలనీలోని మురుగునీటి కాల్వలు కొందరు పూడ్చేశారని స్థానికులు ఆరోపించారు. తమ ఇళ్ల నుంచి మురికినీరు బయటికి పోవడానికి వీలులేకుండా ఉందని గ్రామస్తులు మీడియా ముందు వాపోతున్నారు. కాల్వలు పూడ్చేసిన విషయమై సచివాలయం సెక్రటరీకి పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారానికి చొరవ చూపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఇళ్లముందు మురికి నీరు నిల్వ ఉండడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వలో పేరుకున్న మట్టి తొలగించి మురికినీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్నపూర్ణేశ్వరీ ఉత్సవ విగ్రహం బహూకరణ



పెద్దతిప్పసముద్రం మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయానికి పీటీఎం వాసి పూల సుభద్రమ్మ, గంగులప్ప దంపతులు అన్నపూర్ణేశ్వరీ ఉత్సవ విగ్రహాన్ని బహూకరించారు. రెండున్నర అడుగుల మేరకు అన్నపూర్ణేశ్వరి అమ్మవారి పంచలోహ ఉత్సవ విగ్రహానికి ఆలయంలో వేదపండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఉత్సవ విగ్రహానికి సనగరం పట్టాభిరామయ్య అధ్వర్యంలో పంచామృతాభిషేకం, సంప్రోక్షణ, పూర్ణాహుతి అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తిలకించేందుకు పీటీఎం సహా సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో శివాలయ సేవకులు సుబ్రమణ్యం, సూర్యనారాయణ, బి.కొత్తకోటకు చెందిన ఆకుల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

'మరుగుదొడ్ల నిర్మాణంలో ట్యాంకు ఆక్రమణ ఆపండి'

బి.కొత్తకోట, మార్చి7(ఆంధ్రజ్యోతి): వాటర్ ట్యాంకులోకి నీటిని పంపించే పైపును ఆక్రమించి మరుగుదొడ్లను నిర్మించడం సరికాదని పట్టణ ప్రముఖులు కనకంటి చంద్ర, బంగారు వెంకట్రమణ తదితరులు నగర పంచాయతీ కమిషనర్ పల్లవికి విన్నవించారు. జ్యోతి సర్కిల్‌లో వాటర్‌ట్యాంకు చుట్టూ వున్న ఆక్రమణలను తొలగించి ప్రజాసౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం శుభశూచకమన్నారు. 50 ఏళ్లగా బి.కొత్తకోట పట్టణానికి సేవలందిస్తున్న ఈ ట్యాంకును కాపాడుకోవాలన్నారు. ఈ ట్యాంకుకు ఏ బోరు నుంచి నీటిని సరఫరా చేయాలన్నా ఈ పైపు ద్వారానే జరగాలని, దీనిని ఆక్రమించి మరుగుదొడ్లలోనికి కలిపేస్తే భవిష్యత్తులో నీటి కాలుష్యం ఏర్పడే ప్రమాదమందని వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ సంబంధిత విషయమై టెక్నికల్‌గా విచారిస్తామని, అవసరమైతే ప్రజావసరాల రీత్యా మార్పులు చేస్తామన్నారు. పరిశీలించి నివేదిక ఇవ్వాలని నగరపంచాయతీ ఏఈ రాజేంద్రకు ఆమె సూచించారు.

గ్రామపంచాయితీ కార్యాలయము : కలికిరి

రె.క.నెం: 03/2025 తేది : 05-03-2025

2025-26 సం॥నకు బహిరంగ వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది గ్రామ ప్రజలకు తెలియజేయడమేమనగా! ఇంతకు పూర్వము ఇందు నిమిత్తము జారీచేయబడిన యావత్తు నోటిఫికేషన్ మరియు నిబంధనలు ఇందుమూలముగా రద్దు గావించబడి ఈ నోటిఫికేషన్ కలికిరి గ్రామ పంచాయితీచే తీర్మానము సంఖ్య: 4 తేది:15-02-2025 గల తీర్మానము నందు ఆమోదించబడినది. తేది: 12-03-2025 న అనగా బుధవారం ఉదయం: 11-00 గంటలకు కలికిరి గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో 2025 2026 సంవత్సరము నందు (అనగా **01-04-2025 నుండి 31-03-2026 వరకు**) 1) వారపు సంత2) దినసరి కూరగాయల మార్కెట్ 3) ప్రైవేటు బస్టాండు (ప్రభుత్వ మరియు ఆర్.టి.సి. బస్సులు మినహా) 4) జంతువధశాలలందు రుసుములు వసూళ్ళు 5) గ్రామ పంచాయితీ ఆవరణములో గల మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహణ చేసుకొను హక్కులకై బహిరంగ వేలము వేయబడును. కావున వేలము నందు పాల్గొనదలచినవారు వేలపు నోటిఫికేషన్ నిబంధనలకు లోబడి క్రింద కనిన గుత్తలు వాటికి ఎదురుగా కనిన డిపాజిట్ల మొత్తమును **"PANCHAYAT SECRETARY, GRAM PANCHAYAT, KALIKIRI"** వారి పేరున **STATE BANK OF INDIA** బ్యాంక్ డి.డి. **(DEMAND DRAFT)**ని సమర్పించవలెను. నగదు రూప డిపాజిట్లు స్వీకరించబడవు. పంచాయితీ కార్యదర్శి వారిచే లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము జరుపబడును. (షరతులు వర్తించబడును.)

వ.నెం.	గుత్త వివరములు	(డి.డి. రూపాన) చెల్లించవలసిన డిపాజిట్టు మొత్తం (రూపాయలు)
1.	వారపు సంత	5,00,000-00
2.	దినసరి కూరగాయల మార్కెట్	1,00,000-00
3.	ప్రైవేట్ బస్టాండు (ప్రభుత్వ మరియు ఆర్.టి.సి. బస్సులు మినహా)	2,00,000-00
4.	జంతువధశాల, మాంసపు అంగళ్ళు	50,000-00
5.	గ్రామ పంచాయితీ ఆవరణములో గల మినరల్ వాటర్ ప్లాంటు	50,000-00

బహిరంగ వేలపు షరతులు (2025-26 సం॥నకు) : 1) వేలములో పాల్గొనువారు పంచాయితీకి ఎలాంటి పన్నులు, కిస్తులు మరియు లీజు మొత్తములు బాకీలు ఉండరాదు. 2) వేలము నందు షెడ్యూలులో కనిన మేరకు డిపాజిట్లు మరియు సాల్వెన్సీ హాజరుపరిచినవారు మాత్రమే పాల్గొనవలెను. బినామీలు మరియు ఆథరైజేషన్ వారు వేలము నందు పాల్గొనరాదు. అందుకు అనుమతించబడదు. 3) వేలపు నోటిఫికేషన్ నిబంధనల మేరకు వేలములు నిర్వహించబడును. 4) ఏ కారణము తెలుపకనే వేలము పాటను నిలుపుదల చేయుటకు వాయిదా వేయుటకున్ను మరియు రద్దు పరచుటకున్ను పంచాయితీ కార్యదర్శి వారికి పూర్తి అధికారము కలదు. 5) వేలము పాట ముగిసిన వారము రోజుల లోపుగా హెచ్చుపాటదారు వేలము మొత్తమును ఒకే సారి చెల్లించవలెను మరియు హెచ్చుపాట మొత్తముపై 3% స్టాంపు డ్యూటీని చెల్లించవలెను. అట్లు సదరు మొత్తమును చెల్లించని యెడల వేలము డిపాజిట్టును పంచాయితీ నిధికి దండుగ క్రింద జమచేసి రెండవ హెచ్చు పాటదారునికి అవకాశము కల్పించబడును. మరియు వేలము నందు వరుసగా ఒకటవ రెండవ హెచ్చు పాటదార్ల డిపాజిట్టు వేలమును ఖాయపరచు వరకు వాపసు చేయబడవు. 6) బహిరంగ వేలపు నిబంధనలు తెలియ గోరువారు కార్యాలయ పని వేళలందు తెలుసుకొనవచ్చును.

సం/-శ్రీ అశోక్ ఎం.ఎ. పంచాయితీ కార్యదర్శి, గ్రామ పంచాయితీ కలికిరి.	శ్రీ యం.మహమ్మద్ రియాజుద్దీన్, ఎం.ఎ., విస్తరణాధికారి (PR & RD) కలికిరి	శ్రీ కె.నాగరాజు డివిజనల్ పంచాయితీ అధికారి, మదనపల్లె	సం/- శ్రీ ఆర్.యల్లయ్య సర్పంచ్, గ్రామ పంచాయితీ కలికిరి.

పార్వేట ఉత్సవంపై దాడి దుర్మార్గం

మదనపల్లె అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం రాయచోటిలో పార్వేట ఉత్సవంపై దాడి జరగడం దుర్మాగర్గమని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు అగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గట్టి రామ్మోహన్, కార్యదర్శి సోంపల్లె సురేష్ బాబు మాట్లాడుతూ ఏటా అనవాయితీగా నిర్వహించే వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంపై అన్యమతస్తులు పథకం ప్రకారమే దాడి చేసి గందరగోళం సృష్టించారని ఆరోపించారు. దేవుని ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, చిన్న పిల్లలపై కూడా దాడి జరపడం హేయమన్నారు. వీహెచ్‌పీ జిల్లా సహాయ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, నాగప్రసాదనాయుడు, పోలూరి సుధాకర్, గాంధీ, రెడ్డెప్ప, హేమనాథ్, గుణభూషణ్ పాల్గొన్నారు.

డీసీఐసీ సెక్రటరీగా వీఎస్ రెడ్డి



మదనపల్లె టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం (డీసీఐసీ) సెక్రటరీగా పేస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వీఎస్ రెడ్డిని నియమిస్తూ జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లెలో వీఎస్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించడం, వారిని చైతన్యవంతులను చేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే వినియోగదారుల సమాచార కేంద్రం సమావేశాల్లో పాల్గొని జిల్లాలో వినియోగదారుల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు. మండల వినియోగదారుల కమిటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

సాధికారత కోసం నైతిక విలువలు పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న సెకండ్ ఏడీజే అబ్రహాం

మదనపల్లె టౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత సాధించాలంటే ప్రతి ఒక్కరూ నైతిక విలువలు పాటించాలని సెకండ్ ఏడీజే అబ్రహాం పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సదస్సులో జడ్జి మాట్లాడుతూ మహిళ ఇంట్లో తల్లి, చెల్లి, భార్యగా అందించే సహకారం నేటి సమాజంలో అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి, న్యాయవాదులు బాలజ్యోతి, సుజాత, సుకుమారి, ఉష, మాధవి, అధ్యాపకులు వనజ, విష్ణుప్రియ, జ్యోతి, హజీరాభాను, ఖాజావలి, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఐసీడీఎస్ కార్యాలయం నుంచి అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు.

23న తిరుపతిలో మాలల సింహగర్జన

పీలేరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న తిరుపతిలో మాలల సింహగర్జన ఏర్పాటు చేసినట్లు మాలమహానాడు జేఏసీ అధ్యక్షుడు యమలా సుదర్శనం తెలిపారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక తీర్పును వెంటనే రద్దు చేయాలని మాలమహానాడు ఆయన డిమాండ్ చేశారు. పీలేరులో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మాలల ఉనికి తగ్గించేందుకు జరుగుతున్న అనేక కుట్రల్లో సుప్రీం కోర్టు తీర్పు ఒకటన్నారు.

మహిళల కోసం 'అవణి'

పీలేరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కోసం ప్రత్యేకంగా 'అవణి' డిపాజిట్ పథకం ప్రవేశపెట్టినట్లు డీసీసీబీ మేనేజర్ త్యాగరాజు పేర్కొన్నారు. ఈ పథకంతో మహిళలకు డిపాజిట్‌పై 8.30 శాతం వడ్డీ ఉంటుందన్నారు. సీనియర్ సిటిజన్ మహిళలకు 8.40 శాతం వడ్డీ ఇస్తామన్నారు. డిపాజిట్లను శుక్రవారం నుంచి 31వ తేదీ వరకు స్వీకరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



ఎస్‌ఓపల్లి వద్ద చెత్త సంపద కేంద్రం తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

పెద్దమండ్యం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాలను పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్‌పీఓ నాగరాజు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం పెద్దమండ్యం, ఎస్ ఓపల్లి గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమష్టిగా గ్రామాభివృద్ధి సాధించాలన్నారు. ఇంటి పన్ను వంద శాతం పూర్తి చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి సేకరించిన తడి చెత్త, పొడి చెత్త వేరు వేరు చేసి వర్మీ కంపోస్టులు తయారు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో అన్ని చోట్ల చెత్త సంపద కేంద్రాలు విజయవంతంగా నడపాలన్నారు. ఎంపీడీఓ శ్రీధర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు సుబ్రమణ్యం, లక్ష్మీప్రసన్న కూటమి నేతలు గంగాధర, మహేశ్వర తదితరులు పాల్గొన్నారు.

బసినికొండలో అక్రమణల సర్వే



సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): బసినికొండలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిగా తేల్చారు. బసినికొండ పంచాయతీ నిమ్మనపల్లె రోడ్డు శివాలయం సమీపంలో కొందరు శుక్రవారం చెట్లు తొలగించి భూమిని చదును చేస్తున్న విషయం తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందింది. తహసీల్దార్ ధనంజయులు ఆదేశాల మేరకు బసినికొండలో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిగా తేల్చారు. మండల సర్వేయర్ రెడ్డి శేఖర్, వీఆర్వో విజ్ఞాన్, మామూర్తి, విలేస్ సర్వేయర్ పాల్గొన్నారు.

నల్లారి చిత్రపటానికి పాలాభిషేకం

పీలేరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మినరల్ వాటర్ ప్లాంట్ల ఆపరేటర్లు శుక్రవారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అసెంబ్లీలో తమ సమస్యలు లేవనెత్తి తమకు జీతాల చెల్లింపును సుగమం చేసినందుకు కృతజ్ఞత ప్రకటించారు. పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు నల్లారి రియాజ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బుడిముబ్బడిగా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి దానిని ప్రచారాస్త్రంగా వాడుకుని ఆపరేటర్లు, ప్లాంట్లను గాలికి వదిలేశారన్నారు. ఈ సమస్యను అసెంబ్లీలో లేవనెత్తి జీతాలు, నిర్వహణ బాధ్యతను పంచాయతీలకు ఇచ్చేలా చూస్తున్నారన్నారు.

అమ్మ ప్రోత్సాహంతోనే సివిల్స్‌లో రాణించా : ఎస్పీ



కురబలకోట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మా అమ్మ ప్రోత్సాహంతోనే సివిల్స్‌లో రాణించానని, నా కంటే మా అమ్మకు ఎక్కు గా పట్టుదల ఉండడంతోనే నేను ఈ స్థాయికి చేరుకున్నానని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. శుక్రవారం మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ మహిళాదినోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ మా అమ్మ స్కూల్ ఎడ్యుకేషన్ వరకే చదువుకున్నా నన్ను ఈ స్థానంలో నిలబెట్టిందన్నారు. అక్షరాస్యతకు, విద్యకు చాలా తేడా ఉందని, చదువుకున్న ప్రతి ఒక్కరూ మేధావి కాదన్నారు. మహిళా సాధికారత అంటే గుర్తింపుహక్కు మాత్రమే కాదని, అవకాశాలను సృష్టించుకుని అభివృద్ధి చెందాలన్నారు. రాష్ట్రపతి, హోం మంత్రులు మహిళలేనని వారిని ఆదర్శంగా తీసుకుని రాణించాలన్నారు. కళాశాల ప్రెసిడెంట్ ద్వారకనాథ్, డీఎస్పీ కొండయ్య, ప్రిన్సిపాల్ యువరాజ్ పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక



మదనపల్లె అర్బన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పేర్కొన్నారు. స్థానిక సంతగేట్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్(వాయల్పాడు), అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరరావు, రమణ, చలపతి, పెంచలయ్య(రాజంపేట), కార్యదర్శిగా ముబారక్ (మదనపల్లె), సహాయ కార్యదర్శిగా కోడూరు హరి, కుడుం శరత్, రెడ్డెప్ప, మల్లికార్జున, హరి, వెంకటరమణ, కోశాధికారిగా మస్తాన్(మదనపల్లె)ను ఎన్నిక చేశారు. నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాలో ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు.

పవన్‌కల్యాణ్‌ను విమర్శిస్తే తగిన బుద్ధి చెబుతాం

ములకలచెరువు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను విమర్శిస్తే మాజీ సీఎం జగన్‌కు తగిన బుద్ధి చెబుతామని జనసేన రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త అతికారి క్రిష్ణ, తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ హెచ్చరించారు. ములకలచెరువులో శుక్రవారం జరిగిన నియోజకవర్గ జనసేన పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజా నేత పవన్‌కల్యాణ్‌పై విమర్శలు చేయడం తగదన్నారు. 14వతేదీన పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాలకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. నేతలు సుదర్శన్, షోరూం సూరి, ఉత్తన్న పాల్గొన్నారు.

నాటుసారాతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

పెద్దమండ్యం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ, అమ్మకాలు జరగడం, తాగి మీ జీవితాలు నాశనం చేసుకోవద్దని ములకలచెరువు ఎక్సైజ్ సీఐ మాధవి పిలుపు నిచ్చారు. ఎస్‌ఓపల్లి తండాలో శుక్రవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో నవోదయం 2.0లో ఆమె మాట్లాడుతూ పిల్లల ఉన్నత విద్య కోసం తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ, వెలుగు రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాహన రుణాలు కూడా సద్వినియోగం చేసుకోవాలని రుణాలపై అవగాహన కల్పించారు. తండా వాసులు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. నాటుసారాను నిర్మూలించి సమష్టిగా కృషి చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పోస్టర్లు ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ పద్మావతి, తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, వీఆర్‌ఓలు భద్రనాయుడు, మంజునాథరెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

బి.కొత్తకోట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): తాటంవారిపల్లెలో వైసీపీ నేతల చెర నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు తహసీల్దార్ అజారుద్దీన్, నగరపంచాయతీ కమిషనర్ జీవీపల్లవి, పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లిఖిత పూర్వక ఫిర్యాదును ఆయా అధికారులకు అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామలెక్క దాఖలా సర్వేనంబరు 1624లో రోడ్డు పోరంబోకు భూమి సబ్ డివిజన్ అయ్యి తొమ్మిది లెటర్లుగా విభజన అయింది. ఇందులో వైసీపీ నేతలు ఎనిమిది లెటర్లను ఆక్రమించుకుని ఇళ్లు, పునాదులు, బంకులు ఏర్పాటు చేసుకున్నారన్నారు. 1624లో మిగిలిన 3వ లెటర్‌ను సైతం కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. ఫిర్యాదుపై విచారిస్తామని, బాధితులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ అన్నారు.

అన్ని రంగాల్లో ఉన్నత స్థానాల్లో మహిళలు

పీలేరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి అన్నారు. సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ముందస్తు మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ మహిళలు విద్య, వైద్య, శాస్త్ర, సాంకేతిక, వ్యాపార, పారిశ్రామిక, అంతరిక్ష రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించిన వారి విజయగాథలతో స్ఫూర్తి పొంది మిగిలిన వారు కూడా ముందుకెళ్లాలని సూచించారు.